# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శనివారం-21- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 25 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## ప్రజాసేవే నాకు ప్రథమ కర్తవ్యం

- బిహార్‌లో భారీ అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన
- ఆర్జేడీ, కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు
- పేదల సాధికారత దిశగా అడుగులు
- ఒడిశా అభివృద్ధికి రూ.18,600 కోట్ల ప్రాజెక్టులు
- ట్రంప్ ఆహ్వానాన్ని తిరస్కరించిన మోదీ



న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

నిత్యం ప్రజాసేవ చేయకపోతే ప్రశాంతంగా నిద్రించలేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రాత్రి పగలు ప్రజల కోసమే పని చేస్తున్నానని చెప్పారు. ఆయన శుక్రవారం బిహార్, ఒడిశాలో పర్యటించారు. తొలుత బిహార్‌లోని సివాన్ జిల్లాలో రూ.5,900 కోట్లకుపైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. బిహార్‌లోని పాటలీపుత్ర జంక్షన్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ వరకు నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించారు.

మిగతా 2లో..

## చిన్నారుల పాట విని కన్నీళ్లు పెట్టుకున్న రాష్ట్రపతి ముర్ము

- డెహ్రాడూన్‌లో రాష్ట్రపతి ముర్ము పుట్టినరోజు వేడుకలు
- దృష్టిహీన చిన్నారుల గానం రాష్ట్రపతిని కరిగించిన క్షణం
- "వాళ్లు పాడిన పాట నా మనసును తాకింది" – ముర్ము
- ప్రముఖుల నుంచి రాష్ట్రపతికి శుభాకాంక్షల వెల్లువ
- మయూర్‌భంజ్ నుంచి రాష్ట్రపతి భవన్ వరకు ముర్ము ప్రయాణం

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)


చిన్నారుల పాట విని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కరిగిపోయారు. ప్రస్తుతం ఉత్తరాఖండ్‌లో పర్యటనలో ఉన్న రాష్ట్రపతి ముర్ము శుక్రవారం 67వ బర్త్‌డే జరుపుకున్నారు. డెహ్రాడూన్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ విజువల్ డిజబిలిటీస్‌కు వెళ్లిన ఆమెకు చిన్నారులు ఘన స్వాగతం పలికారు.



మిగతా 2లో..

## ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు ముదురుతున్న యుద్ధం

- బీర్‌షిబా టెక్‌పార్క్‌పై ఇరాన్ క్షిపణి దాడి
- మైక్రోసాఫ్ట్ సమీపంలో అగ్ని ప్రమాదం
- హైఫా మిసైల్ దాడిలో 23 మందికి గాయాలు
- టెహ్రాన్ సహా పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ విమాన దాడులు
- కెర్మన్‌షా, తబ్రీజ్‌లో క్షిపణి కేంద్రాలపై భారీ దాడులు



టెహ్రాన్, (తెలంగాణ ముచ్చట్లు)

అటు ఇజ్రాయెలూ తగ్గడం లేదు. ఇటు ఇరానూ వెనుకడుగు వేయడం లేదు. సై అంటే సై అంటున్నాయి. యుద్ధం ఎనిమిదో రోజైన శుక్రవారం పరస్పర దాడుల తీవ్రతను మరింత పెంచాయి. ఒకవైపు యుద్ధం ఆపడానికి జెనీవాలో చర్చల ప్రక్రియ ప్రారంభమైనా.. రెండు దేశాలు బాంబుల వర్షాన్ని కురిపిస్తూనే ఉన్నాయి. టెల్ అవీవ్, హైఫా, బీర్‌షిబా నగరాలపై బాలిస్టిక్ క్షిపణులతో ఇరాన్ విరుచుకుపడింది.

మిగతా 7లో..



## కొండా సురేఖ ఘాటు వ్యాఖ్యలు

### కాంగ్రెస్‌లో అలజడి

- కడియం శ్రీహరిపై కఠిన వ్యాఖ్యలు చేసిన మంత్రి సురేఖ
- మంత్రి పదవిని కోల్పోతానన్న తప్పుడు ప్రచారంపై స్పందన
- "కూతురు ఎంపీ అయ్యిందని నేను వ్యతిరేకించానా?" – సురేఖ ప్రశ్న
- భద్రకాళీ ఆలయంపై నాయని రాజేందర్ రెడ్డికి కౌంటర్
- భద్రకాళీ అమ్మవారికి బోనం సమర్పణపై అపోహలు తొలగించాలి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

కాంగ్రెస్ సీనియర్ నేతలపై కొండా మురళి వివాదాస్పద వ్యాఖ్యలు ఆ పార్టీలో ఒకవైపు ప్రకంపనలు సృష్టిస్తుంటే, మంత్రి కొండా సురేఖ సైతం అదే తరహాలో మాట్లాడారు. కడియం శ్రీహరి నల్లికుట్ల మనిషని, సీఎం రేవంత్ వద్దకు, పొంగులేటి వద్దకు వెళ్లా తన మీద ఉన్నది లేనిది చెబుతున్నారంటూ విమర్శలు చేశారు. మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. 'నేను మంత్రిగా ఉంటే నా ముందు కూర్చోవడానికి నామోషీగా ఫీల్ అవుతున్నారు కడియం శ్రీహరి.

మిగతా 2లో..

# గోదావరి-బనకచర్లపై చర్చకు సిద్ధం

### హక్కులలో రాజీ లేదు: సీఎం రేవంత్ రెడ్డి

- బనకచర్లపై కేంద్రానికి నివేదిక సమర్పించడంపై ఏపీపై ఆగ్రహం
- మాజీ సీఎంలే తెలంగాణ హక్కులు తాకట్టు పెట్టారని విమర్శ
- 2016లోనే జలాల తరలింపుకు పునాది – రేవంత్ ఆరోపణ
- కృష్ణా జలాల్లో 500 టీఎంసీలే మా హక్కు
- కేసీఆర్, హరీశ్‌రావుల నిర్ణయాలపై రేవంత్ స్పందన
- బీజేపీ, టీడీపీ, బీఆర్‌ఎస్ ఓటు రాజకీయాలు ఆడుతున్నాయి
- కిషన్‌రెడ్డి కేటీఆర్‌కు లైజనింగ్ ఆఫీసర్‌గా మారారని విమర్శ

2లో..






## అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

- సామాజిక న్యాయం పునాదిపై ఆర్థిక అభివృద్ధి.. కాంగ్రెస్ సిద్ధాంతం
- పెట్టుబడులకు సరైన వేదిక హైదరాబాద్
- అసోచామ్ సదరన్ కౌన్సిల్ సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఆర్థిక అభివృద్ధి తో పాటు మానవీయ కోణాన్ని జోడిస్తూ తెలంగాణ రాష్ట్రం లోని ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి ఓ కొత్త నిర్వచనాన్ని రచిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం ఆయన హైదరాబాదులోని అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (అసోచామ్) సదరన్ రీజియన్ సీఎస్ఆర్ అండ్ సస్టెయినబిలిటీ సదస్సు, అవార్డుల ప్రదానోత్సవాన్ని హైదరాబాద్ మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో నిర్వహించారు., అవార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక క్రమశిక్షణ, సామాజిక, పర్యావరణ బాధ్యత లతో కూడిన తెలంగాణను నిర్మించేందుకు యావత్ క్యాబినెట్ కట్టుబడి పని చేస్తుంది అన్నారు. మనం ఇప్పుడు అపార వనరులు ఉన్నా కానీ అసమానతలు ఉన్న ప్రపంచంలో జీవిస్తున్నాం అన్నారు. ' 'ట్రికిల్ డౌన్' ఆర్థిక వ్యవస్థలు పనిచేయలేవని స్పష్టం అయ్యింది, ఇప్పుడు కేవలం ' లిఫ్ట్ ఆల్' అందరినీ అభివృద్ధి చేయాలన్నది అనివార్యం అన్నారు.

మిగతా 2లో..




## వ్యవసాయ రంగంలో ఏఐ ఉపయోగం: మంత్రి తుమ్మల

- వానాకాలం సీజన్‌నుంచి ఏఐ ప్రయోగానికి శ్రీకారం
- భూమి, పంటల డేటా విశ్లేషణకు సాంకేతికత వినియోగం
- చీడపీడల గుర్తింపులో మనుషుల మీద ఆధారాన్ని తగ్గించేది లక్ష్యం
- ప్రొఫెసర్ నీలిమ ఏఐపై చేసిన పరిశోధనలు మంత్రి సమీక్ష
- ఇక్రిశాట్, అగ్రివాస్ సంస్థల తాజా సాంకేతిక పరిజ్ఞానం పరిచయం
- వ్యవసాయ శాఖ అధికారుల సమీక్ష సమావేశం



2లో..

## ప్రభాకర్‌రావు విచారణలో నూతన మలుపు



- ఐదో విడత విచారణలో డీజీపీపై పదులు వేసిన ప్రభాకర్‌రావు
- మాజీ ప్రభుత్వ పెద్దల వైపు బొటనవేలు చూపిన ప్రయత్నం
- మావోయిస్టు అనుమానంతో ఫోన్ ట్యాపింగ్ చేశామని మొదటి వాదన

2లో..




## ఐదు పోలవరం ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలి

### పోలవరం ముంపుపై రౌండ్ టేబుల్ సమావేశంలో : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

- ఈ నెల 25న ప్రధాని ప్రగతి ఎజెండా సమావేశంలో దీనిపై చర్చించాలి
- ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపడానికి కేంద్రంపై సీఎం రేవంత్ రెడ్డి ఒత్తిడి తేవాలి
- పోలవరం ముంపుపై సంయుక్త సర్వే నిర్వహించాలి
- పోలవరం స్పిల్ వే సామర్థ్యం పెంపుతో భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

పోలవరం ప్రాజెక్టు సంబంధించి ఆంధ్ర ప్రదేశ్ లో కలిపిన ఐదు ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ నెల 25వ తేదీన తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, చత్తీస్ గఢ్, ఒడిశా రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రగతి ఎజెండా పేరిట ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నిర్వహించబోయే సమావేశంలో ఈ అంశంపై చర్చించాలని సూచించారు.

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# గోదావరి-బనకచర్లపై చర్చకు సిద్ధం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)



''ఇరు రాష్ట్రాలు కూర్చొని మాట్లాడుకుంటే గోదావరిబనకచర్ల సమస్య పరిష్కారమవుతుంది. ఇలా చర్చించుకోవడంలో మాకేమీ భేషజాలు లేవు. అలాగని తెలంగాణ హక్కులను కోల్పోవడానికి సిద్ధంగా లేం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన దిల్లీలోని తన అధికార నివాసంలో విలేకర్లతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తెలంగాణ ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెట్టింది మాజీ సీఎం కేసీఆర్, నాటి ఇరిగేషన్ మంత్రి హరీశ్‌రావులేనని ఆరోపించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 299 టీఎంసీల వాటా సరిపోతుందని 2015లో లేఖ ఇచ్చింది హరీశ్‌రావేనని, గోదావరి వరద నీటిని పెన్నా పరీవాహక ప్రాంతానికి తరలించడానికి అభ్యంతరం లేదంటూ 2016 నాటి ఎపెక్స్ కౌన్సిల్‌లో చెప్పింది కేసీఆరేనని ధ్వజమెత్తారు. అందుకు సంబంధించిన లేఖలు, మీటింగ్ మినిట్స్‌ను రేవంత్‌రెడ్డి మీడియాకు విడుదల చేశారు.

**ఏ రాష్ట్రంతోనూ వివాదాలు కోరుకోం**

''ఏపీ ప్రభుత్వం బనకచర్ల ప్రతిపాదనలపై ముందుగా తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయం అడిగి ఉండాల్సింది. ఎపెక్స్ కౌన్సిల్ వంటి మార్గాల్లో కాకుండా.. ఏపీ సీఎం చంద్రబాబు నేరుగా బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్‌ఆర్)ను కేంద్రానికి సమర్పించడం అభ్యంతరకరం. ఆంధ్రప్రదేశ్ మాకు దిగువన ఉంటే.. మేం కర్ణాటక, మహారాష్ట్రలకు దిగువన ఉన్నాం. ఏ రాష్ట్రంతోనూ మేం వివాదాలు కోరుకోవడంలేదు. అదే సమయంలో తెలంగాణ హక్కులనూ వదులుకోబోం. మాకున్న అనుమానాలపై చర్చించి పరిష్కరించుకోవాలనుకుంటున్నాం. దీనిపై ఈ నెల 23న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తాం.. అవసరమైతే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిని మేమే చర్చలకు ఆహ్వానిస్తాం. ముందు ముఖ్యమంత్రుల స్థాయిలో చర్చించుకొని తర్వాత ఎపెక్స్ కౌన్సిల్‌కు వెళ్తాం.

**భారాస అప్పుడెందుకు మాట్లాడలేదు?**

జలాల తరలింపునకు పునాది పడిందే హరీశ్‌రావు సాగునీటిశాఖ మంత్రిగా ఉన్నప్పుడు. గోదావరి వరద జలాలను రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల అవసరాల కోసం తరలించేందుకు డీపీఆర్ తయారు చేసే బాధ్యతను వాప్కోస్‌కు అప్పగిస్తూ 2016 ఏప్రిల్ 16న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో నంబరు 262ను జారీ చేసింది. ప్రకాశం బ్యారేజీ నుంచి పెదగంజాం వయా కమ్మమూర్ కెనాల్ వరకు నీటి తరలింపు, గుండ్లకమ్మ రిజర్వాయర్ నుంచి సంగం బ్యారేజీకి వరదజలాల తరలింపు కోసం మరో డీపీఆర్ తయారీ బాధ్యతను అదే వాప్కోస్‌కు అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం 2018 మార్చి 29న జీవోఆర్‌టీ నం.230 విడుదల చేసింది. ఆనాడు తెలంగాణ నీటిపారుదల మంత్రిగా ఈ జీవోల గురించి నోరెత్తని హరీశ్‌రావు.. ఇప్పుడు పెద్దపెద్ద ఉపన్యాసాలిస్తున్నారు. గోదావరి నుంచి పెన్నా పరీవాహక ప్రాంతానికి 400 టీఎంసీల నీరు తరలించడానికి నాలుగు ప్రత్యామ్నాయాలను వాప్కోస్ డీపీఆర్‌లో సూచించింది. బనకచర్ల.. పెన్నా బేసిన్‌లో ఒక భాగమే. కానీ ఆ డీపీఆర్ గురించి ఆనాడు భారాస ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అలా దానికి 2016లోనే పునాది పడింది. అదే ఏడాది జరిగిన ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ గోదావరి జలాల తరలింపునకు అప్పటి సీఎం కేసీఆర్ అంగీకరించారు.

**భారాస కంటే 95 టీఎంసీలు ఎక్కువే అడుగుతున్నాం**

కృష్ణా జలాల్లో మేం 500 టీఎంసీలు అడుగుతుంటే భారాస తప్పు పడుతోంది. కానీ రాష్ట్రానికి 299 టీఎంసీలు చాలని 2015 జూన్ 18, 19 తేదీల్లో జరిగిన కృష్ణా నదీ యాజమాన్యమండలి సమావేశంలో లేఖ రాసి ఇచ్చింది అప్పటి నీటిపారుదల మంత్రి హరీశ్‌రావే. 2020 డిసెంబరు 19న జరిగిన మరో కేఆర్‌ఎంబీ మీటింగ్‌లోనూ కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణల మధ్య 66:33 నిష్పత్తిలో పంచుకోవడానికి అంగీకరించారు. 2020 డిసెంబరు 22న జరిగిన ఎపెక్స్ కమిటీ సమావేశంలో.. కేడబ్ల్యూడీటీ2 తీర్పు నోటిపై చేసేంతవరకూ కేడబ్ల్యూడీటీ1 తీర్పు ప్రకారం ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీల మేర పంపిణీ చేయడానికి అంగీకరించింది కూడా కేసీఆరే. అయితే అప్పటివరకు తాము చెప్పింది తప్పని గుర్తించి.. కృష్ణా జలాలను ఏపీ, తెలంగాణల మధ్య 50:50 నిష్పత్తిలో పంపిణీ చేయాలని 2023 జులై 10వ తేదీన హరీశ్‌రావు రాష్ట్ర ఆర్థికమంత్రి హోదాలో కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు లేఖ రాశారు. దాని ప్రకారం.. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన 811 టీఎంసీల్లో 50% అంటే 405.5 టీఎంసీలే. మేం అంతకంటే దాదాపు 95 టీఎంసీలు ఎక్కువగా.. 500 టీఎంసీలు ఇవ్వాలని అడుగుతున్నాం. ఇప్పుడు దీన్ని తప్పుబట్టే వారిని ఏమనాలి? ఈ విషయంలో తీసేసిన తహసీల్దార్లు చేసే విమర్శలను నేను పట్టించుకోను.

**ఆ విషయం వారికే తెలియాలి**

తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుకు ఆంధ్రప్రదేశ్ అనుమతులు తీసుకుందా? అని కొందరు అడుగుతున్నారు. అది పాత ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టే. కేసీఆర్ దాని డిజైన్ మార్చి కాళేశ్వరం కట్టారు. దానిపై అప్పట్లో ఎపెక్స్ కౌన్సిల్‌లో చర్చించారా? లేదా? అన్నది కేసీఆర్, చంద్రబాబునాయుడు, జగన్మోహన్‌రెడ్డిలకే తెలియాలి.

# అభివృద్ధికి కొత్త నిర్వచనం తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక వృద్ధి సామాజిక న్యాయం పునాదిపై నిలవాలని కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతం, తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఆసిద్ధాంతానికి కట్టుబడి పని చేస్తుంది అన్నారు. పారిశ్రామికవేత్తల చర్యలు దానం కోసం కాకుండా బాధ్యత కోసం కావాలి, మీ పని ప్రశంసల కోసం కాదు సామాజిక మార్పు కోసం అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మనందరి ప్రయత్నం సంస్థల నిర్మాణం కోసం మాత్రమే కాకుండా సమాజాల శ్రేయస్సు కోసం కూడా పనిచేయాలని డిప్యూటీ సీఎం ఉద్బోధించారు. కార్పొరేట్ సంస్థలు %సీఎస్ఆర్% (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులు ఖర్చు చేసేందుకు తెలంగాణ రాష్ట్రం సరైన వేదిక ఈ సందర్భంగా భట్టి అన్నారు. ఈ రాష్ట్రంలో మీరు అనుకున్న లక్ష్యాలను నూటికి నూరు శాతం నెరవేర్చడమే కాదు, ప్రతి పైసాను పారదర్శకంగా ఖర్చు చేసేందుకు అవకాశం ఉందని దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ సంస్థలు తెలంగాణ రాష్ట్రంలో %సీఎస్ఆర్% నిధులు ఖర్చు చేయాలని పిలుపునిచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ రాష్ట్రం అనువైన ప్రాంతం అన్నారు. ఇక్కడ అనుకూలమైన అందరికీ సరిపోయే వాతావరణం, భాషా సమస్య లేదు, శాంతిభద్రతలు, తక్కువ ధరకు పుష్కలంగా లభించే మానవ వనరులు, అన్నిటికీ మించి ఫ్రెండ్లీ గవర్నమెంట్ ఇక్కడ ఉందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఈ దేశంలోని రాష్ట్రాలతో కాదు అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతుంది అన్నారు. హెల్త్, ఫార్మా, ఐటీ, ఫుడ్ గ్రైన్స్ వంటి రంగాల్లో తెలంగాణ దితిరుగులేని ప్రస్థానం అన్నారు. ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ తో పేద విద్యార్థులకు విద్యను అందించాలన్న లక్ష్యంతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నాం అని తెలిపారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల క్యాంపస్లో, ఒక్కో పాఠశాలను 200 కోట్ల పెట్టుబడితో నిర్మిస్తున్నాం అన్నారు. మొదటి దశలో నియోజకవర్గానికి ఒక పాఠశాల చొప్పున 100 పాఠశాలలు మంజూరు చేసాం అన్నారు. స్కూల్స్ నిర్మించడం కాదు వాటిని నిర్వహించడమే సమస్య అని ఓ మిత్రుడు సూచించారు. ఈ నేపథ్యంలో నిర్వాణ కోసం కార్పొరేట్ కంపెనీలను సంప్రదించగా గొప్ప స్పందన కనిపించింది ఆ పాఠశాలలన్నిటిని నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని కార్పొరేట్ కంపెనీలు 15 రోజుల వ్యవధిలోనే హామీ ఇవ్వడం గమనార్హం అన్నారు.గతంలో నిర్మించిన 100 ఐటిఐ లను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నాం, ఈ కార్యక్రమానికి ప్రసిద్ధ కార్పొరేట్ కంపెనీలు ముందుకు వచ్చాయని డిప్యూటీ సీఎం తెలిపారు. సీఎస్ఆర్ అంటే లాభాల్లో రెండు శాతం ప్రజాహిత కార్యక్రమాలకు కేటాయించడానికి చట్టపరమైన బాధ్యతగా చూస్తాం, కానీ నేను ఒక భిన్నమైన దృష్టి కొనాన్ని సమావేశానికి హాజరైన వారితో పంచుకోవాలని కోరుకుంటున్నట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. సమాజాన్ని పరిగణలోకి తీసుకోని అభివృద్ధి సరైనది కాదు, ప్రయోజనం లేని లాభం శూన్యమే అన్నారు. సుస్థిరత అనేది పర్యావరణానికి మాత్రమే పరిమితం కాదు అది మానవ గౌరవాన్ని కూడా కలిగి ఉండాలన్నారు, అభివృద్ధి ఫలితాలు కేవలం కార్పొరేట్ ఆఫీసులకే పరిమితం కాకూడదు అవి ప్రభుత్వ పాఠశాలలోని బాలికలకు, ఇబ్బందుల్లో ఉన్న రైతులకు, అంతరించిపోతున్న గ్రామీణ కళాకారులకు చేరాలి అన్నారు. ఉపాధి కల్పించే పరిశ్రమలను మేము ప్రభుత్వానికి విరాళాలు ఇచ్చే సంస్థలు గా కాకుండా భాగస్వాములుగా చూస్తున్నాం అన్నారు. పల్లెల్లో యువతకు గ్రీన్ స్కిల్ స్ లో శిక్షణ, మహిళా సంఘాలకు కేవలం నిధులు మాత్రమే కాకుండా యంత్రాలు, శిక్షణ, మార్కెటింగ్ పై అవగాహన కల్పించాలని ఒకేసారి నిధులు కేటాయించడం కాదు దీర్ఘకాలిక అభివృద్ధికి మార్గదర్శకులుగా మారుద్దాం అని డిప్యూటీ సీఎం అన్నారు. మీరు పని చేసే ప్రాంతాల్లో ప్రజల జీవన అనుభవాలను తెలుసుకోవాలని, స్థానిక ప్రజా సంస్థలతో కలిసి పని చేయాలని సూచించారు. నిర్మించిన భవనాలు పాతవి అవుతాయి కానీ ప్రజల నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, నాయకత్వం వంటి అంశాలు నిరంతరం ప్రభావాన్ని చూపుతాయి అన్నారు. ప్రతి సీఎస్ఆర్ పథకం ప్రజలు తమ కాళ్ళ మీద నిలబడేలా చేయాలి, చేతులు చాచేలా కాదు, స్వరాజ్య స్ఫూర్తితో స్వయం విశ్వాసంతో నడవాలి అని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, నిర్వాహకులు సురేష్ చుక్కపల్లి, బారుల్ ఇస్లాం, అభిషేక రంజన్, కృష్ణ ఏదుల తదితరులు పాల్గొన్నారు.




# వ్యవసాయ రంగంలో ఏఐ ఉపయోగం: మంత్రి తుమ్మల

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

వ్యవసాయ రంగంలోనూ కృత్రిమమేధ(ఏఐ)ను వినియోగించి రైతులకు మరింత సమర్థంగా సేవలందించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వ్యవసాయ యోగ్యమైన భూమి, సీజన్ల వారీగా పంటల విస్తీర్ణం, చీడపీడల గుర్తింపులో మనుషుల వాడకాన్ని తగ్గించి సాంకేతికతను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ వానాకాలం సీజన్ నుంచే ప్రయోగాత్మకంగా దీనిని ప్రారంభిస్తామని చెప్పారు. ఈ విషయంపై సచివాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణ విశ్వవిద్యాలయ అగ్రోనమి ప్రొఫెసర్ నీలిమ తాను మూడేళ్లుగా ఏఐ వినియోగంపై చేస్తున్న పరిశోధనలను మంత్రికి వివరించారు. ఇక్రిశాట్ ప్రతినిధులు ఉపగ్రహ ఛాయాచిత్రాల ఆధారంగా వివిధ రాష్ట్రాలకు అందిస్తున్న సేవలు, పంటల సాగు విస్తీర్ణ అంచనా పద్ధతులను వెల్లడించారు. అగ్రివాస్ ప్రతినిధులు పంటలకు సోకే తెగుళ్లు, నీటి ఎద్దడి పరిస్థితుల అంచనాకు ఉపగ్రహ ఆధారిత పరిజ్ఞానం వినియోగం గురించి తెలిపారు. సమావేశంలో వ్యవసాయ కార్యదర్శి రఘునందన్‌రావు, సంచాలకుడు గోపి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభాకర్‌రావు విచారణలో నూతన మలుపు

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో నాలుగు విడతలుగా పొంతన లేని సమాధానాలు చెబుతూ వచ్చిన ప్రధాన నిందితుడు ప్రభాకర్‌రావు తాజాగా కొత్త పల్లవి అందుకున్నట్లు కనిపిస్తోంది. అయిదో విడతగా శుక్రవారం ఆయన్ని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారించింది. తనకు నాటి డీజీపీ చెబితేనే అప్పట్లో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డానని, నాటి ప్రభుత్వ పెద్దలెవరూ తనకు ఈ విషయంలో ఆదేశాలు ఇవ్వలేదని ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) తాజాగా వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. అప్పట్లో ఫోన్ అక్రమ ట్యాపింగ్ వ్యవహారాలను పర్యవేక్షించిన ఇతర నిందితులు ప్రణీత్‌రావు, భుజంగరావు, రాధాకిషన్‌రావు, తిరుపతన్న అంతా ప్రభాకర్‌రావు చెప్పినట్లే పనిచేశామని ఇప్పటికే సిట్‌కు వాంగ్మూలమిచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వారికి ఎందుకు ఆదేశాలు ఇచ్చారనే కోణంలో సిట్ ప్రస్తుతం ప్రభాకర్‌రావును ప్రశ్నిస్తోంది. మొదట మావోయిస్టులకు సహకరించినందుకే కొందరి ఫోన్లు ట్యాపింగ్ చేయాల్సి వచ్చిందని చెబుతూ వచ్చారు. అందుకు ఆధారాలు చూపాలని సిట్ ప్రశ్నించడంతో ప్రస్తుతం ఉన్నతాధికారుల వైపు వేలెత్తి చూపినట్లు తెలిసింది. అయితే ప్రభాకర్‌రావు కేసు నుంచి తప్పించుకునేందుకే ఇలాంటి ఎత్తుగడలకు పాల్పడుతున్నారని సిట్ అనుమానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ఏపీఎస్ఆర్టీసీ మాజీ ఛైర్మన్ గోనె ప్రకాశ్‌రావు శుక్రవారం సిట్ అధికారుల ఎదుట హాజరై వాంగ్మూలమిచ్చారు.

# కొండా సురేఖ ఘాటు వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి)

అందుకే నా మంత్రి పదవి పోతుందంటూ తప్పుడు ప్రచారం చేపిస్తున్నాడు. సీఎం దగ్గరకు, పొంగులేటి వద్దకు వెళ్లి నా మీద ఉన్నది లేనిది చెబుతున్నాడు. తెలుగుదేశంలో నడిపించుకున్నట్లు ఇక్కడ కూడా నడిపించాలని అనుకుంటున్నాడు. నా అదృష్టం ఉంది నేను మంత్రి అయ్యాను. ఆయనకు అదృష్టం ఉన్నప్పుడు ఆయన కూడా మంత్రి అయ్యాడు. నన్ను దిగిపోవాలని అనుకుంటే ఎలా?, నా కూతురికి అదృష్టం లేదు ఎమ్మెల్యే కాలేదు. కడియం కూతురికి అదృష్టం ఉంది ఎంపీ అయ్యింది. నేను ఆమె ఎంపీ పదవి తీయాలని అంటున్నానా?, అని కొండా సురేఖ ప్రశ్నించారు.

**భద్రకాళీ టెంపుల్ ఎవరి సొత్తు కాదు..**

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయని రాజేందర్‌రెడ్డికి సురేఖ కౌంటర్ ఇచ్చారు. కొందరు భద్రకాళీ టెంపుల్ తమ సొత్తు అనుకుంటున్నారని, అది ఎవరి సొత్తు కాదనే విషయం తెలుసుకోవాలన్నారు. రాజేందర్‌రెడ్డి ప్రెస్‌మీట్ పెట్టి మాట్లాడటం సరికాదు. ఆయన అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. ఆగమశాస్త్ర ప్రకారం భద్రకాళీ అమ్మవారికి బోనం సమర్పించాలని నిర్ణయించుకున్నాం. అక్కడ యాటలు కోస్తారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అమ్మవారు శాఖాహారీ అని అందరికీ తెలుసు. అక్కడ ఏళ్లుగా పనిచేస్తున్న పూజార్ల అభిప్రాయం తీసుకున్నాం. బల్కంపేట దేవాలయం నుంచి బోనం తీసుకువెళ్లి భద్రకాళి అమ్మవారికి సమర్పిస్తాం' అని కొండా సురేఖ తెలిపారు.

# చిన్నారుల పాట విని కన్నీళ్లు పెట్టుకున్న రాష్ట్రపతి ముర్ము

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అంధులైన చిన్నారులు రాష్ట్రపతికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఒక పాట ఆలపించారు.

'ఈ రోజులు మళ్లీ మళ్లీ రావాలి, నా హృదయం మళ్లీ మళ్లీ పాడాలి, మీరు వెయ్యేళ్లు జీవించాలి, ఇదే నా కోరిక, హ్యాపీ బర్త్ డే టూ యూ.. (బార్ బార్ దిన్ ఏ ఆయే, బార్ బార్ దిల్ యే గాయే, తు జియో హజారోం సాల్, యే మేరీ హై ఆర్జూ...)అంటూ సాగిన పాట విని ఆమె కన్నీటిని ఆపుకోలేకపోయారు. 'వాళ్లెంతో అందంగా, హృద్యంగా పాడారు. నేనెంతో ఉద్వేగానికి లోనయ్యా. వారి పాటవిని సంతోషంతో ఉప్పొంగిపోయా. నా కళ్ల వెంట నీళ్లు ఆగకుండా వచ్చేస్తూనే ఉన్నాయి'అని ఆమె పేర్కొన్నారు. కాగా, రాష్ట్రపతి ముర్ముకు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తదితర ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె జీవితం, నాయకత్వం దేశవ్యాప్తంగా కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తాయని ప్రశంసించారు. ఒడిశాలోని మయూర్‌భంజ్‌లో 1958 జూన్ 20వ తేదీన ముర్ము జన్మించారు. దేశానికి 15వ రాష్ట్రపతిగా 2022 జూలై 25న బాధ్యతలు చేపట్టారు.



# ప్రజాసేవే నాకు ప్రథమ కర్తవ్యం

(మొదటి పేజీ తరువాయి)


ఈ సందర్భంగా బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. విపక్ష రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ), కాంగ్రెస్‌లపై విరుచుకుపడ్డారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను ఆర్జేడీ అవమానించిందని ఆరోపించారు. వారసత్వ రాజకీయాలను అంబేద్కర్ వ్యతిరేకించారని గుర్తుచేశారు. అందుకే అంబేద్కర్ అంటే ఆర్జేడీ, దాని మిత్రపక్షాలకు ఇష్టం లేదన్నారు.


బాబాసాహెబ్ చిత్రపటాన్ని ఆర్జేడీ నేతలు పాదాలతో తొక్కేశారని, దీనిపై క్షమాపణ చెప్పాలని ప్రజలు డిమాండ్ చేస్తే ఏమాత్రం స్పందించలేదని మండిపడ్డారు. అంబేద్కర్ కంటే తామే గొప్పవాళ్లమని ఆర్జేడీ-కాంగ్రెస్ నాయకులు అహంకారం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అంబేద్కర్ తన హృదయంలో ఉన్నాడని, ఆయన చిత్రపటాన్ని గుండెకు హత్తుకోవడం తనకు ఇష్టమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆర్థిక వనరులు కొల్లగొట్టడానికి ఆర్జేడీ, కాంగ్రెస్ కాచుకొని కూర్చున్నాయని, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమిని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# ఐదు పోలవరం ముంపు గ్రామాలను తిరిగి తెలంగాణకు ఇవ్వాలి

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం ముంపుపై, ఏపీలో కలిపిన భద్రాచలం సమీపంలోని ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపాలన్న అంశంపై తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లాడారు.ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ.... ఏపీలో కలిపిన గ్రామాల్లోని పురుషోత్తపట్నం, గుండాల, ఎట్టపాక, కన్నాయగూడెం, పిచ్చుకలపాక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య వివక్షకు గురవుతూ ఏ ప్రభుత్వం పట్టించుకోకుండా ఉన్నారని వివరించారు. కరకట్టల ఎత్తు పెంచుకుంటేనే భవిష్యత్తులో కూడా ఐదు గ్రామాలకు రక్షణ ఉంటుందని, లేదంటే ఏ ఒక్క ఏడాదిలో కూడా భారీ వరదలు వస్తే అన్ని గ్రామాలు మునిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం వల్ల భద్రాచలం ప్రాంతానికి శాశ్వత ముంపు ఏర్పడిరదని తెలిపారు. పోలవరం స్పిల్ వే సామర్థ్యాన్ని 50 లక్షల క్యూసెక్కులకు పెంచుకోవడం వల్ల తెలంగాణకు బ్యాక్ వాటర్ సమస్య ఏర్పడుతుందని, భద్రాచలం రామాలయం మునిగిపోయే ప్రమాదంలో ఉందని పేర్కొన్నారు.ఏపీలో కలిపిన పురుషోత్తపట్నంలో భద్రాచలం రాముడి భూమి వెయ్యి ఎకరాలు ఉందని, వెయ్యి ఎకరాల దేవుడి మాన్యం ఆంధ్రాకి పోయింది... దేవుడేమో తెలంగాణలో ఉన్నాడు అని తెలిపారు. అక్కడ పట్టించుకునే పరిస్థితి లేక దేవుడి మాన్యం అన్యాక్రాంతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడి మాన్యాన్ని పరిరక్షించాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలవరం ముంపుపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు సంయుక్త సర్వే నిర్వహించాలని సూచించారు. ఐదు గ్రామాలను తిరిగి తెలంగాణలో కలపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఈ అంశంపై న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టును ఆపే ప్రయత్నంలో తెలంగాణ జాగృతి సుప్రీం కోర్టును ఆశ్రయించిందని గుర్తు చేశారు. 2014లో ప్రధాని మోదీ మొట్టమొదటి క్యాబినెట్ సమావేశంలో లో ఏడు మండలాలను ఏపీలో కలపడానికి ఆర్డినెన్స్ ను ఆమోదించి అన్యాయం చేశారని విమర్శించారు. ఏడు మండలాలను అన్యాయంగా ఏపీలో కలిపారని, లోయర్ సిలేరు విద్యుత్తు ప్రాజెక్టును కూడా ఏపీ అప్పజెప్పారని మండిపడ్డారు. బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి చంద్రబాబు ఏడు మండలాలను తీసుకున్నారని ఆరోపించారు. ఇది విభజన చట్టానికి, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమని అప్పుడే పార్లమెంటులో తాము గళమెత్తామని, బీఆర్ఎస్ పార్టీ సభ్యులం పార్లమెంటులో మాట్లాడాము కానీ కాంగ్రెస్ సభ్యులు మాత్రం ఆ నాడు కూడా పట్టనట్టు వ్యవహరించారని తెలియజేశారు.సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) రాష్ట్ర కార్యదర్శి గోవర్ధన్ మాట్లాడుతూ, కేంద్రంలో చంద్రబాబు కీలకంగా ఉండటంతోనే 2014లో అవసరం లేకపోయినా తెలంగాణలోని ఏడు మండలాలను నరేంద్రమోదీ ప్రభుత్వం ఆంధ్రలో విలీనం చేసిందన్నారు. భద్రాచల రాముడికి మోదీ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. పోలవరం ముంపులో భాగం కాని ఎటపాక, కన్నాయిగూడెం, గుండాల, పిచ్చుకలపాడు, పురుషోత్తపట్నం గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలుపుతూ ఆర్డినెన్స్ తేవాలని డిమాండ్ చేశారు. భద్రాచలంతో తెలంగాణ ప్రజలకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. భద్రాచలం లేని తెలంగాణను ఊహించడం కష్టమన్నారు. ఈ నెల 25వ తేదీన ప్రధానమంత్రి మోడీ ఆధ్వర్యంలో జరిగే సీఎంల మీటింగ్ లో ఐదు గ్రామ పంచాయతీలపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడాలన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న ముగ్గురు మంత్రులు ఐదు గ్రామ పంచాయతీల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భద్రాచలం డెవలప్మెంట్ ఫోరం, ఐదు గ్రామ పంచాయతీల హక్కుల సాధన సమితి నాయకులు జంగిలి సంపత్, ఆవులూరి సత్యనారాయణ, దాసరి బాలకృష్ణ, రాసాల నర్సయ్య, గొల్లపల్లి శివ, కాటిబోయిన ఆనంద్, వివిధ ప్రజాసంఘాల నాయకులు వీరన్న, రూప్ సింగ్, లోకిని రాజు, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. రౌండ్ సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను ఈనెల 25న నిర్వహించే ప్రగతి ఎజెండా సమావేశంలో ప్రధాని ముందు పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు.






# కరెంటోళ్ళు కనికరించండి

- ప్రాణాంతకరంగా మారిన విద్యుత్ వైర్లు
- పలుసార్లు చెప్పినా పట్టించుకోని పవర్ ఆఫీసర్లు
- ముత్యమంత పని ముప్ప తిప్పలు పెట్టిస్తున్న అధికారులు
- విద్యుత్తు షాక్ తో రైతుల ప్రాణాలు పోతే తప్ప పట్టించుకోరా

**స్టేషన్ ఘనపూర్, తెలంగాణ ముచ్చట్లు**

పంట పొలాల్లో విద్యుత్ తీగలు యమా పాశాలుగా మారుతున్నాయి. విద్యుత్ వైర్లు నేలను తాకినట్టుగా ఉన్నాయి తీగలు పంట పొలాల్లో పడి వ్యవసాయ పనులకు ఆటంకం కలిగిస్తున్నాయి. చేతికి అందేలా విద్యుత్ తీగలు ఉండడంతో ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని పంట పొలాల్లో పనులు చేసుకుంటున్నా రైతు పలుసార్లు విద్యుత్ అధికారులకు మొరపెట్టుకున్న పట్టించుకోని వైనం ఉన్నది 20 గుంటల స్థలం అందులో మెయిన్ లైన్ మరో లైన్ ఇలా రెండు లైన్లు ప్రమాదకరంగా మారాయి. చేతులెత్తితే తగిలే ఈ విద్యుత్ తీగలతో వారికి ప్రాణాపాయం పొంచి ఉంది. కిందికి వేలాడుతున్న వైర్లను సరిచేయాలని కోరినా అధికారులు స్పందించటం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు స్టేషన్ ఘనాపూర్ మండల కేంద్రంలో తానేదార్ పల్లి గ్రామ రైతు మంతెన మైపాల్ రెడ్డి అనే రైతు పొలంలో రెండు లైన్ల కరెంటు వైర్లు ఆ రెండు లైన్లు చేయి చాచితే అందేట్టుగా ఉండడంతో పనులు చేసుకోవాలంటే వనికి పోతున్న వైనం పొలంలో విద్యుత్ తీగలు ఇలా వేలాడుతున్నాయి. ఈ పొలంలో పనులు కొనసాగించాలంటే భయంభయంగాసాగిస్తున్నారు.


బాధిత రైతు మహిపాల్ రెడ్డి

రైతు మాట్లాడుతూ అనేకసార్లు విద్యుత్ అధికారులకు సమస్యపై లెటర్ ఇచ్చామని ఆయన పట్టించుకోవడంలేదని సంవత్సరం దాటిపోయిన ఇప్పటివరకు ఏ ఒక్క అధికారి వచ్చి చూసిన దాఖలాలు లేవన్నారు. గతంలో ఆ విద్యుత్ వైర్లు తగిలి నాకు కరెంట్ షాక్ వచ్చిందని తృటిలో ప్రాణాపాయ స్థితిలో నుండి తప్పించుకున్నాను అన్నారు. పొలంలో మెయిన్ లైన్ మోటార్లకు వెళ్లే విద్యుత్తు లైన్ ఈ రెండు ఉండడంతో ఈ రెండు లైన్లు చాపితే అందేట్టుగా ఉండడంతో నాటువేయాలన్నా ట్రాక్టర్ తో పొలమును దున్నుకోవాలని చాలా ఇబ్బందులకు ఎదుర్కొంటున్నామన్నారు. నాటు వేయడానికి కూలీలున్న రమ్మన్న రాని పరిస్థితి ఏర్పడిందన్నారు కరెంట్ వైర్లు కిందికి ఆదమరిస్తే అంతే మా ప్రాణాలు పోతాయి అని భయపడి కూలికి ఎవరు రావడంలేదని అన్నారు. ఏ అధికారిని కలిసిన నిర్లక్ష్యపు మాటలే తప్ప పట్టించుకునే దాకలాలు లేవన్నారు. వరి నాటు వేయాలన్న వారి కోత సమయంలో వరి కోత మిషన్ పెట్టి కోయాలన్న ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి పనే కానీ అధికారులు నన్ను ముప్పు తిప్పలు పెడుతున్నారని ఎందుకు పలుమార్లు చెప్పిన దాటేసే దూరం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మనుషుల ప్రాణాలు పోయిన తర్వాత అధికారులు స్పందించి ఈ వేలాడుతున్న కరెంటు తీగలను సారి చేస్తారేమో అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని లేదంటే ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్తామని ఆయన అన్నారు.

# విపత్తుల నిర్వహణకు పకడ్బందీగా సన్నద్ధం కావాలి.....

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



విపత్తుల నిర్వహణకు పకడ్బందీగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డితో కలిసి విపత్తుల నిర్వహణపై ఎన్డిఆర్ఎఫ్ బృందం, సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ గత సంవత్సరం వచ్చిన భారీ వరదల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో 3 నెలల పాటు ఎన్.డి.ఆర్. ఎఫ్. బృందాలు స్టేషన్ లో ఉండేలా చర్యలు చేపట్టి, అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా అధికారులు పూర్తి చేయాలని తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా రిహాబిలిటేషన్ సెంటర్ లను ముందుగా గుర్తించాలని, అవసరమైన పక్షంలో ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లను కూడా రిహాబిలిటేషన్ సెంటర్ గా ఏర్పాటు చేయాలని, ఏ ప్రాంతం ప్రజలను ఏ సురక్షిత ప్రాంతానికి తరలిస్తారు అనే విషయమై మ్యాపింగ్ చేసి సోమవారం నాటికి వివరాలు అందించాలని అన్నారు. వాతావరణ శాఖ నుంచి వరద ముప్పు ఉందని హెచ్చరిక రాగానే జిల్లాలో హెలికాప్టర్ అందుబాటులో పెట్టుకోవాలని, వరద సమయంలో అవసరమైన బోట్లు, రోప్స్, లైఫ్ జాకెట్, మైక్స్, లైట్లు, జేసిబి , క్లినింగ్ ఎక్విప్మెంట్ మొదలగు సామాగ్రి డివిజన్, గ్రామం వారీగా అందుబాటులో పెట్టాలని అన్నారు. వరద తర్వాత పారిశుధ్య నిర్వహణకు సంబంధించి సిబ్బంది, జవాన్ లను ఇళ్ల వారీగా కేటాయించాలని అన్నారు. వరద ప్రభావిత ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన బ్లాంకెట్, బట్టలు, ఆహార సామాగ్రి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సిద్ధం చేసుకోవాలని అన్నారు. విపత్తుల సమయంలో ప్రజలు ప్యానిక్ కాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, జిల్లా యంత్రాంగంతో ఎలా సహకరించాలి వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి మండలంలో విపత్తు నిర్వహణ కోసం అవసరమైన సామాగ్రి అందుబాటులో ఉంచుకోవాలని, వాటి పనితీరు ఒక్కసారి చెక్ చేయాలని కలెక్టర్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను సన్నద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, ఎన్డిఆర్ఎఫ్ బృందం కమాండర్ ఎస్. గౌతం, ఏ.ఎస్.ఐ మద్దిలేటి, హెడ్ కానిస్టేబుల్స్ జగదీష్, సురేష్ కుమార్, కానిస్టేబుల్స్ రియాజుద్దీన్ , కె. జనార్ధన్, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దళితులపై అగ్రవర్ణాల మూకుమ్మడిదాడి దుర్మార్గచర్య

- ఫిర్యాదుచేసిన కామేపల్లి పోలీసులు పట్టించుకోకపోవడం దారుణం
- దాడిచేసిన వారిపై అట్రాసిటి కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలి
- మాదిగహక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ జేఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టె గురుమూర్తి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**




దళితులపై అగ్రవర్ణాల మూకుమ్మడిదాడి దుర్మార్గచర్య అని, దాడిచేసిన వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని మాదిగహక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షులు కొరిపల్లి శ్రీనివాస్, మాదిగ జేఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టె గురుమూర్తి డిమాండ్ చేశారు. ఖమ్మం ప్రెస్క్లబ్లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కామెపల్లి మండలం పింజరమడుగు గ్రామంలో మాదిగ కులానికి చెందిన పేదలైన చిప్పలపల్లి అచ్చయ్య, పిచ్చయ్య అన్నదమ్ములకు 12.30ఎకరాల ఇనాం భూమిని ఇచ్చారు. అందులో కొంత భూమి అమ్ముకోవడం, కొంత ఆక్రమణకు గురికావడం జరిగిందని వారు ఆరోపించారు. అందులో చిప్పలపల్లి శ్రీనివాసరావు తన తండ్రికి ఇచ్చిన 34 కుంటల భూమిని జూన్ 14న ఉదయం 10గంటల సమయంలో బాగుచేసుకుంటుండగా మాదిగోడా మా భూముల పక్కన నీకు భూమి ఎక్కడుందిరా అంటూ పేరుతో నానా భూతులు తిడుతూ.. కులం తక్కవ నా కొడుకుల్లారా అంటూ అగ్రకులానికి చెందిన దమ్మాలపాటి సత్యం, దమ్మాలపాటి అచ్చయ్య, దమ్మాలపాటి చిన్న వెంకన్న, గుజ్జలపుడి రాంబాబు, పంతంగి శ్రీను, వంకాయలపాటి సత్తమయ్య, శివరాత్రి రామారావు, పంతంగి పార్వతి లు చిప్పలపల్లి శ్రీనివాసరావుపై గడ్డపార, కర్రలతో దాడిచేసి కాలు ఇరగ్గొట్టారన్నారు. శ్రీనివాసరావు భయంతో ఇతరుల సాయంలో స్థానిక కామేపల్లి పోలీస్ స్టేషన్లో మధ్యాహ్నం ఫిర్యాదుచేసిన పట్టించుకోలేదన్నారు. సాయంత్రం 6గంటల సమయంలో శ్రీనివాసరావు తమ్ముడు ఆటో డ్రైవర్ చిప్పలపల్లి ఆనందరావును కొట్టారు. మరలా ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోలేదన్నారు. మరుసటి రోజు జూన్ 15న మా వాళ్ళను ఎందుకు కొట్టారని అడిగినందుకు రేణుక, లక్ష్మి, ఈశ్వరమ్మ లను కూడా విచక్షణారహితంగా కర్రలతో మూకుమ్మడిగా దాడిచేస్తూ నానాబూతులు తిట్టుకుంటూ కొట్టారని బాధితులు ఆవేధనను వ్యక్తంచేశారు. జిల్లా అధికారులు విచారణచేసి దాడిచేసి గాయపరిచిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటి కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో ఎస్సీ ఉపకులాల జేఏసి తెలంగాణ అధ్యక్షులు గవరవరపు డేవిడ్ రాజు, దండోరా జిల్లా అధ్యక్షులు దుప్పెల్లి శ్రీను, ఆర్పిఐ పార్టీ రాష్ట్ర నాయకులు నకిరికంటి సంజీవరావు, పరిశాల వెంకన్న, కొండ వెంకన్న, చర్మకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇటికల లత, బాధితులు పాల్గొన్నారు.



## స్నేహితురాలికి ఆర్థిక సహాయం అందించిన స్నేహితులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వ,తరగతి 20012002 బ్యాచ్ తోటి మిత్రులతో చదువుకున్న అల్వాల గ్రామనికి చెందిన చైనా బేగం భర్త గత ఎనిమిది నెలల క్రితం ఆకస్మికంగా మరణించిన విషయం తెలుసుకొని తమ మిత్రులు ఆర్థిక సహాయం గా వారి కుటుంబానికి తమ వంతుగా 23,200/వేల రూపాయలు అందజేశారు. భవిష్యత్తులో తమ వంతుగా తోడుగా ఉంటామని మనోధైర్యాన్నిస్తూ.. తమ కుటుంబానికి ఎల్లవేళలా తోటి స్నేహితులు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్నేహితులు పాల్గొన్నారు.

# చంద్రబాబుపై విషం చిమ్మటం కేసీఆర్ కుటుంబానికి తగదు

- వాసిరెడ్డి భాస్కరరావు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



తెలుగుదేశంపార్టీ ఖమ్మం జిల్లా కార్యాలయంలో టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాలు నీటి వాడకంపై మాజీ మంత్రి హరీష్ రావు నీటి వాటా పై రాష్ట్ర హక్కును ఏపీ సీఎం చంద్రబాబు కు రాసిస్తే ఊరుకోబోమని చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు,

ప్రతిపక్ష పార్టీల అనుచిత వ్యాఖ్యలకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి గారు గోదావరి బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునేందుకు పోరాటం చేస్తామన్న వ్యాఖ్యలపై ఏపీ సీఎం చంద్రబాబు స్పందించి సరైన సమాధానం ఇచ్చారని కితాబు పలికారు, తెలంగాణతో నేనెప్పుడైనా గొడవపడ్డానా..? వాళ్లతో పోరాటం ఎందుకు..? కట్టుకోవాలనుకున్న ప్రాజెక్టులు కట్టుకోండి.. కాలేశ్వరం కడితే ఆపామా..? తెలంగాణ వాళ్లతో పోరాటం చేయను.. పైనుంచి నీళ్లు వాడుకోకపోతే కిందకే వస్తాయి గోదావరిలో మిగిలిన నీటినే వాడుకుంటాం బనకచర్లతో ఎవరికీ నష్టం లేదు అని స్పష్టం చేశారు, గొడవలు సృష్టించొద్దనీ అవసరమైతే ఢిల్లీలో చర్చించుకుందాం అని చంద్రబాబు స్పందించిన తీరును హర్షిస్తూ తెలుగుదేశంపార్టీ క్రమశిక్షణ గల పార్టీ అని ఇచ్చిపుచ్చుకోనే ధోరణి తప్ప సమస్యలు సృష్టించే పార్టీ కాదని అన్నారు అయినా బుద్ధి మార్చుకోని బిఆర్ఎస్ పార్టీ సముద్రంలో కలిసే నీటిపై సమస్య సృష్టించడం సమంజసం కాదని తెలంగాణ, ఏపీ కొట్లాడితే ఎవరికి లాభం అని ఇకనైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులు వంకర బుద్ధి మార్చుకొని గొడవలు సృష్టించవద్దని టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి భాస్కరరావు హెచ్చరించారు.

# షుగర్ నియంత్రణ- యోగా ప్రభావం

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఈ సంవత్సరం యోగా దినోత్సవ నినాదం"వన్ ఇయర్ టూ- వన్ హెల్త్"ఒక భూమి ఆరోగ్య గామి"

దశాబ్ది కాలం ముందు పాశ్చాత్య ఆరోగ్య వ్యవస్థలు ..వ్యాధి నిరోధకత వ్యాధి చికిత్సలో యోగా ప్రభావాన్ని తక్కువగా అంచనా వేశాయి. కానీ యోగా పుట్టినిల్లయిన భారతదేశం చూపిన చొరవతో శాస్త్రీయ పరిశోధనలు జరిగిన తర్వాత జబ్బుల పై ,ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులు అసాంక్రామిక వ్యాధులు (బి పి,షుగర్,అధికబరువుల,కొలెస్ట్రాల్ . క్యాన్సర్,హార్మోనల్ డిసార్డర్స్) ఆధునిక వైద్యంతో పాటు యోగాని జత చేయడం వలన మెరుగైన ఫలితాలున్నాయని గమనించారు. యోగా కేవలం ఆసనాలు మాత్రమే కాదు.

ఒకే క్రమశిక్షణతో కూడిన నిరంతర జీవనశైలి ధ్యానం సాత్వికాహారం, ప్రాణామాయం, మంత్ర పఠనం,విశ్రాంతి, తత్త్వచింత, ఆధ్యాత్మికత యోగాలో అంతర్భాగాలు.

**షుగర్ వ్యాధిపై యోగా ప్రభావం**

క్రమం తప్పని యోగా సాధన వలన పూర్తిగా జబ్బు నయం కాకపోవచ్చు కాని వ్యాధి నియంత్రణలో చాలా ప్రభావం చూపుతుంది

1) ప్రి డయాబెటిస్ నుంచి డయాబెటిస్ లోకి మారడాన్ని ఆపగలదు
2) వాడే మందు డోసులను తగ్గించగలదు
3) షుగర్ యొక్క సంక్లిష్టతలైన రెటినోపతి(కంటి జబ్బులు) న్యూరోపతి (నరాల జబ్బులు) నెఫ్రోపతి (కిడ్ని జబ్బులు) వాస్కులోపతి(రక్త నాళల జబ్బులు) వీటిని వీలైనంత వరకు రాకుండా నియంత్రించగలదు.
4) ఇన్సులిన్ ఇంజక్షన్ అవసరం లేకుండా నోటి మాత్రలతో తక్కువ డోసుతో తగ్గించగలదు
5) ట్రైగ్లిజరైడ్స్,ఎల్డిఎల్ వంటి చెడు కొలెస్టరాల్ తగ్గించడం హెచ్ డిఎల్ వంటి మంచి కొలెస్టరాలు పెంచడం ద్వారా గుండె జబ్బుల్ని కూడా నిలారించగలదు
6) ఆసనాల వలన ఉదర కండరాల్లోని కదలిక ఇన్సెలిన్ ఉత్తతిని పాంక్రియాస్ పెంచగలదు.
7) "యోగనిద్ర "పరిగడుపు షుగర్ ని తగ్గించగలదు.
8) ధ్యాన్యం మణిపూరక చక్రంలో కేంద్రీకరించడం ద్వారా పాంక్రియాస్ ఉత్తేజపడుతుంది
9) శంఖ ప్రక్షాళనఇన్సులిన్ పనితనాన్ని పెంచగలుగుతుంది.
10) సూర్య నమస్కారములు ఇన్సులిన్ నిరోధకతలను తగ్గిస్తుంది
11) సూర్యముద్ర,ప్రాణముద్ర,లింగముద్ర షుగర్ని కొంతవరకు నియంత్రిస్తుంది
12) యోగాలో అంతర్భాగమైన సాత్వికాహారం సానుకూల మానసిక జీవన విధానం వ్యసనాలకు దూరంగా ఉంచగలుగుతుంది.


డా.ఎ.వి గిరిసింహారావు
ప్రముఖ జీవనశైలి/షుగర్ వ్యాధి నిపుణులు
సీనియర్ మెడికల్ ఆఫీసర్/రచయిత/
సామాజికవేత్త- ప్రజా రవాణా సంస్థ

# ఆపదలో స్నేహితునికి అండగా నిలిచిన తోటి స్నేహితులు

- 2004-2005 పూర్వ విద్యార్థులు

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

ఆపదలో ఉన్న స్నేహితుడికి తమతో పాటు పదవ తరగతి చదువుకున్న తోటి స్నేహితులు అండగా నిలిచారు. పెద్దమందడి మండలం మోజర్ల మదిగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20042005 బ్యాచ్ వారందరూ కలిసి చదువుకున్నారు. తమతో పాటు కలిసి చదువుకున్న మదిగట్ల గ్రామానికి చెందిన వాకిటి శ్రీను అనారోగ్యానికి గురై, ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. విషయం తెలుసుకున్న 20042005 బ్యాచ్ తోటి స్నేహితులు అందరూ కలిసి స్నేహితుని వైద్యం కోసం 21600/రూపాయల ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్నేహితులు మాట్లాడుతూ.. శ్రీనుకు మెరుగైన వైద్యం కోసం మరింత ఆర్థిక సాయం చేయడానికి మేమందరం అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. శ్రీను కుటుంబ సభ్యులు స్నేహితులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, సాగర్ కుమార్, కృష్ణయ్య, రాంసాగర్, పాల్గొన్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




## ఆర్టీసీ ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర 4వ మహాసభలకు పూర్తయిన ఏర్పాట్లు

- **ఆర్టీసీలో మరో సమరశీల ఐక్యపోరాటానికి వేదిక కానున్న మహాసభలు**
- **ఆహ్వాన సంఘం అధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వరరావు**
- **ఎస్ డబ్ల్యూ ఎఫ్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

శనివారం నుంచి రెండు రోజులపాటు జూన్ 21,22 తేదీలలో (నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్,ఎర్రా శ్రీకాంత్ ప్రాంగణం) ఖమ్మం లోని ఐఎంఐ హాల్లో జరగనున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (సిఐటియు అనుబంధం) రాష్ట్ర నాలుగవ మహాసభలకు ఏర్పాట్లు పూర్తయ్యాయని, మహాసభలకు హాజరయ్యే అతిథులకు,ప్రతినిధులకు ఖమ్మం గుమ్మం సాదర స్వాగతం పలుకుతోందని ఆహ్వాన సంఘం అధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వరరావు, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఖమ్మంలోని సిహెచ్.వి.రామయ్య స్మారక భవనంలో రీజియన్ అధ్యక్షులు గుండు మాధవరావు అధ్యక్షతన ఏర్పాటైన మహాసభల ఆహ్వానసంఘం సమావేశంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు కళ్యాణం వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ మహాసభల జయప్రదం కోసం కార్యకర్తలు,వాలంటీర్లు విశేషంగా కృషి చేస్తున్నారన్నారు. తోరణాలు,జెండాలు,ఫ్లెక్సీలు, బ్యానర్లతో అలంకరణ కార్యక్రమాలు చేస్తున్నారని ఆహ్వాన సంఘం తరపున మహాసభలకు హాజరయ్యే అతిథులకు, ప్రతినిధులకు స్వాగతం పలుకుతున్నామని ఆయన తెలిపారు. రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గడ్డం లింగమూర్తి మాట్లాడుతూ ఎంపికైన ఎస్ డబ్ల్యూ ఎఫ్ ప్రతినిధులందరూ మహాసభలకు హాజరవుతున్నారని, ప్రారంభసభలో ఆర్టీసీలోని అన్ని ప్రధాన సంఘాల నుండి నాయకులు పాల్గొంటున్నారన్నారు. ఆర్టీసీ లోని అన్ని ప్రధాన సంఘాల నాయకులు రాకతో ఆర్టీసీలో సంపూర్ణ జేఏసీ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందనే ఆశాభావాన్ని ఆర్టీసీ కార్మికులు ఆశిస్తున్నారని అందువలన ఆర్టీసీ లోని అన్ని కార్మిక సంఘాలు కార్మిక సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఏకతాటిపై నిలిచి ఒకే జేఏసీగా ఏర్పడాలన్న ఆర్టీసీ కార్మికుల ఆకాంక్షలు ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర నాలుగవ మహాసభల వేదికగా నెరవేరుతాయని ఆర్టీసీ కార్మిక వర్గం ఆకాంక్షిస్తున్నట్టు లింగమూర్తి పేర్కొన్నారు. మహాసభల ప్రారంభ సూచికంగా ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు శనివారం ఉదయం పతాకావిష్కరణ చేస్తారని,మహాసభలో ప్రారంభోపన్యాసం అఖిలభారత రోడ్ రవాణా కార్మికుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మయ్య చేస్తారని తెలిపారు.ప్రారంభ సభలో వక్తలు గా సిఐటియు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్,తమిళనాడు రాష్ట్ర రవాణా రంగం నాయకులు ఏ ఐ ఆర్ టి డబ్ల్యూ ఎఫ్ జాతీయ కార్యదర్శి అర్ముగనయనార్, వర్కింగ్ ఉమెన్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.వి.రమ,ఏఐఆర్ టిడబ్ల్యూఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్ డబ్ల్యూ ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్. సుందరయ్య,అయ్యప్ప రెడ్డి తదితరులు పాల్గొంటున్నారని,సంతాప తీర్మానాన్ని రాష్ట్ర ప్రచార కార్యదర్శి పి.రవీందర్ రెడ్డి ప్రవేశపెడతారని లింగమూర్తి పేర్కొన్నారు. ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల సుధాకర్ మాట్లాడుతూ మహాసభ జయప్రదం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న ఎస్ డబ్ల్యూ ఎఫ్ కార్యకర్తలు అందరికీ ధన్యవాదాలు తెలిపారు మహాసభలలో అనేక కార్మిక సమస్యలపై చర్చలు, తీర్మానాలు ఉంటాయని సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ కమిటీ ఉపాధ్యక్షులు వి.సురేష్, ప్రచార కార్యదర్శి తోకల బాబు, ఖమ్మం డిపో కమిటీ నాయకులు వి.సురేష్,ఎం. బాబు తదితరులు పాల్గొన్నారు.



## హత్యకు గురైన మహిళ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ నాయకులు

- **బాధిత దళిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి**
- **కొమ్ము చెన్నకేశవులు మాదిగ ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు**

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం గట్ల ఖానాపురం గ్రామంలో మహిళా హత్య, అత్యాచారాన్నికి గురైన రేణుక కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. శుక్రవారం పెద్దమందడి మండలం గట్ల ఖానాపురం గ్రామంలో ఇంటివెనక్కి రేణుక ఎస్సీ కులం మాదిగ కులానికి చెందిన నిరుపేద కూలి కుటుంబానికి చెందిన ఆమె హత్యకు గురిచేసిన కురుమూర్తి పై చట్టపరమైన చర్యలు తీసుకుని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసు శాఖ అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఆ కుటుంబానికి జరగాల్సిన చట్టపరమైన ప్రభుత్వం నుంచి అందించే సంక్షేమ అభివృద్ధి రంగాల్లో ముందు వరుసలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నాని అన్నారు. ప్రస్తుతం స్థానిక ఎమ్మార్వో సంబంధిత అధికారులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధర్యం కల్పించాలని హెచ్చరిస్తున్నాం.ఆమెకు ముగ్గురు కుమార్తెలు ఇద్దరు కొడుకులు ఉన్నారు. ఆ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం న్యాయం చేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాం.బాధిత కుటుంబానికి చెందిన ఆమె పిల్లలకు విద్య, అవకాశాలు గురుకుల పాఠశాలలో కల్పించాలి అర్హులైన కుమారులకు కుమార్తెలకు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలి.ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తిస్థాయిలో అమలు చేయాలి.మూడు ఎకరాల భూమి, డబల్ బెడ్ రూమ్ ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నాం.తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ అభయ హస్తం పథకం అమలు అమల్లోకి వచ్చినప్పుడు మొదటి ప్రాధ్యానత ఆ కుటుంబానికి ఇవ్వాలి. స్థానిక ఎమ్మెల్యే మరియు జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే బాధిత కుటుంబాన్ని పరామర్శించి మనోధర్యం కల్పించి పైన తెలిపిన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వెంకట్ రాములు మాదిగ ఎమ్మార్పీఎస్ అల్వాల గ్రామ అధ్యక్షులు,నాగరాజు మాదిగ,సురేష్ మాదిగ, రాజు మాదిగ శేఖర్ జర్నలిస్టులు,గ్రామస్తులు,బాధిత కుటుంబ సభ్యులు బంధుమిత్రులు,కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.






## ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- **ఎంపీ కడియం కావ్య**

**వరంగల్,తెలంగాణ ముచ్చట్లు:**

వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి సహకార మరియు మానిటరింగ్ కమిటీ (దిశా) సమావేశం శుక్రవారం నిర్వహించబడింది. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో దిశా కో చైర్మన్, వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రాం రెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, జిల్లాలో కేంద్ర ప్రభుత్వ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేయాలని అధికారులకు సూచించారు.



ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసం కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. విద్యాశాఖ ద్వారా ప్రభుత్వ బాలికల పాఠశాలల్లో మరుగుదొడ్లు నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

డ్రాప్ అవుట్‌లను తగ్గించేందుకు కృషి చేయాలని, పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా, పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులను కోరారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలని సూచించారు.

వైద్య రంగంపై మాట్లాడిన ఆమె, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. వైద్య విద్యార్థుల నామం వినియోగించుకుంటూ కొందరు వ్యాపారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజల ప్రాణాలకు ప్రమాదం కలగకుండా ఉండేందుకు వైద్య శాఖ అధికారులు ప్రైవేటు ఆసుపత్రులపై నిరంతర తనిఖీలు నిర్వహించాలన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ డెలివరీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని, గర్భిణులకు తగిన కౌన్సిలింగ్ ఇవ్వాలన్నారు. గ్రామస్థాయిలోనే క్యాన్సర్ స్క్రీనింగ్ చేపట్టాలని సూచించారు.

ట్రాన్స్‌జెండర్ల పట్ల ఉన్న వివక్షను తొలగించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేయడంతో పాటు ప్రత్యేక పథకాలు అమలు కావాల్సిన అవసరం ఉందని తెలిపారు.

సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ, రైతులకు శిక్షణా శిబిరాలు నిర్వహించాలన్నారు. వరితో పాటు ఇతర పంటల సాగు విషయంలో కూడా రైతులకు సూచనలు, సాంకేతిక మద్దతు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలు విని పరిష్కరించే దిశగా చురుకుగా వ్యవహరించాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టంగా పేర్కొన్నారు.

## వరంగల్ వైద్య హబ్‌గా రూపుదిద్దుకుంటోంది

- **ఎంపీ కడియం కావ్య**

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

కాకతీయ వైద్య కళాశాలలో మల్టీ డిసిప్లినరీ పరిశోధనా విభాగాన్ని ప్రారంభించిన వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో వరంగల్ నగరం వైద్య రంగంలో కేంద్ర బిందువుగా మారుతుందని చెప్పారు. అన్ని వైద్య సేవలు ఒకేచోట లభించేలా వసతులు కల్పించబడ్డాయన్నారు.

శుక్రవారం స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డితో కలిసి ఈ విభాగాన్ని ఆమె






ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వైద్య విద్యార్థులు పాఠ్యాంశాలకే పరిమితమవకుండా, పరిశోధనా రంగంలోనూ ముందడుగు వేయడానికి ఈ యూనిట్ దోహదం చేస్తుందన్నారు. తాజా వైద్య సాంకేతికతపై అధ్యయనం, ఆవిష్కరణల కోసం ఇది ఉపయోగపడుతుందన్నారు.

వైద్య రంగం మరింత పురోగమించాలంటే పరిశోధనలే పునాదిగా మారాలని అభిప్రాయపడ్డ ఎంపీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, కళాశాల ప్రిన్సిపల్ రామ్ రెడ్డి, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు

- **టి జి ఏ ఎన్ బి డైరెక్టర్ సందీప్ శాండిల్య**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**


మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో టి జి ఏ ఎన్ బి డైరెక్టర్ సందీప్ శాండిల్య అన్నారు.

"అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినం" సందర్భంగా హైదరాబాదు నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో పోలీస్ అధికారులతో తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్ బ్యూరో టి జి ఏ ఎన్ బి డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ..నషా ముక్త్ భారత్ అభియాన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది జూన్ 26వ తేదీన నిర్వహించే అంతర్జాతీయ




మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని జూన్ 20 నుంచి 26 వరకు వారం రోజుల పాటు రాష్ట్రా, జిల్లాల స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, మాదక ద్రవ్య రహిత జీవనం కోసం యువతను, విద్యార్థులకు భాగం కల్పించడం, యోగా, ధ్యాన కార్యక్రమాలు, ర్యాలీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, సెమినార్లు, వర్క్ షాప్ లు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు, చిత్రలేఖన పోటీ, వ్యాసరచన పోటీలు, సైకిల్/ బైక్ ర్యాలీలు వంటి కార్యక్రమాలు నిర్వహించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు.

ప్రస్తుత పరిస్థితులలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, దానివల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని అన్నారు . విద్యాలయంలో డ్రగ్స్ రహిత వాతావరణాన్ని నెలకొల్పడానికి తమ సహకారం ఎల్లవేళలా అందజేయాలని తెలిపారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం



అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశం పైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు.

తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు, సరైన జీవన శైలిని అలవర్చుకొని ఉజ్వల భవిష్యత్తుకు,విద్య పురోగతి వైపు చైతన్యవంతం కావాలని విద్యార్థులకు సూచించారు.

అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లో తీసుకుంటున్న కార్యక్రమాలు పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా&ఆర్డర్ ప్రసాద్ రావు ,సిఐ స్వామి పాల్గొన్నారు.

## రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకం

- **రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

రాజకీయాల్లో యువత పాత్ర ఎంతో కీలకమని రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జెక్కిడి శివచరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ అధ్యక్షతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ నుండి మయూరి సెంటర్ లోని రాజీవ్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి, స్వర్గీయ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా ఎక్స్ ఢెడ్ ఎక్స్ క్యూటివ్ సమావేశం సుమారు 300 మంది జిల్లా, అసెంబ్లీ, మండల,కార్యకర్తలతో నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. మన పని మనం చేసుకుపోవాలని పార్టీ తన పని తాను చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిపోతే అయినా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంలో ఏ



మాత్రం రాజీ పడకుండా అనుకున్న విధముగా అన్ని వాగ్దానాలు అమలు చేసుకుంటూ పోతుందని అన్నారు. ప్రతిపక్ష పార్టీ అదే పనిగా కాంగ్రెస్ పై బురద జల్లే ప్రయత్నం చేస్తుందని దాన్ని మనం గ్రామ స్థాయిలో తిప్పి కొట్టాలని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వేజెండ్ల సాయికుమార్ మాట్లాడుతూ...రాబోవు లోకల్ బాడీ ఎన్నికల్లో క్రియాశీలక పాత్ర పోషించి ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యధిక మెజారిటీ తో గెలుపొందేలా కృషి చేయాలని అన్నారు. సీనియర్ల సలహాలు సూచనలతో నూతన కార్యవర్గం ముందుకు పోతున్నదని ఆయన స్పష్టం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను మారుమూల ప్రాంతాల్లోకి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రాబోవు ఎన్నికల్లో యువజన కాంగ్రెస్ పటిష్ఠంగా ఉన్న దగ్గర యువజన కాంగ్రెస్ కే అత్యధిక సీట్లు వచ్చే విధాంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వంతో కోట్లాడదామని అన్నారు.

జిల్లా* ఇంచార్జి దీపక్ ప్రజ్ఞ మాట్లాడుతూ యువత రాజకీయాల్లోకి రావడానికి యువజన కాంగ్రెస్ ఒక ఫ్లాట్ ఫామ్ వంటిదని అన్నారు. కష్టపడి పని చేసే వారికి పదవులు వాటంతట అవే వస్తాయని అన్నారు. యువజన కాంగ్రెస్ లో కొత్త పాత ఏమీ లేదని ఎవరికీ ఏ సాయం కావాలి అన్నా జిల్లా ఇంచార్జీ గా ఎప్పుడు అందుబాటులో ఉంటానని అన్నారు.ప్రతి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పని చేసి మీరు చేసిన పని గుర్తు పెట్టుకునేలా చేసుకోవాలని అన్నారు. సోషల్ మీడియా ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చేసిన ప్రతి పని దాని



ద్వారా రాష్ట్ర నాయకులు తెలిసే విధముగా సర్క్యులేట్ చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజనీ కుమార్,జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్, ఖలీల్ పాషా, బెజ్జం గంగాధర్, భానోత్ కొటేష్, మరియు జిల్లా ప్రధాన కార్యదర్శి కుక్కల మహేష్, క్రాంతి,బెల్లంకొండ శరత్,రాధాకృష్ణ, ఉత్తేజ్, భూక్యా భద్రం, కార్తీక్ మరియు అన్ని అసెంబ్లీ నియోజక వర్గ అద్యక్షులు, మండల అద్యక్షులు , యువజన కాంగ్రెస్ నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం





'యోగ' ఇది అందరూ ఆచరించగల శక్తివంతమైన ఒక సాధన. ఇది శరీరానికి, ఆనందం, శాంతి సౌభాగ్యాలు సిద్ధింపజేస్తుంది. యోగాసనాలలో సూర్యరశ్మిలోని 'డి' విటమిన్ పొందవచ్చు. రక్త ప్రసరణము శుద్ధముగా, గుండెజబ్బులు రాకుండా ఉంటాయి. యోగ మనలో ఉన్న నిరాకార ఆత్మను తెలుసుకోవటానికి అన్ని విధాల సహకరిస్తుంది. బుద్ధితో, ఆత్మను కలపటమే యోగ పద్ధతి. ప్రతి వ్యక్తి నిరాకార ఆత్మను తెలుసుకొని ప్రశాంతత పొందటమే యోగ సాధన, శరీరానికి ఆత్మ విడిగా ఉందని ప్రయోగాత్మకంగా తెలుసుకొనే పద్ధతి 'యోగశాస్త్రం'.

బ్రహ్మం ఏ విధంగా పరిపూర్ణుడో, సృష్టి ఏ విధంగా సంపూర్ణమో, అదేవిధంగా మహర్షి పతంజలి రచించిన యోగదర్శనం సంపూర్ణ యోగానికి ఆలవాలమైంది.

యోగమనగా పరబ్రహ్మసాక్షాత్కారం. యోగం అనగానే మహర్షి పతంజలి మొదట గుర్తుకు వస్తాడు. ఆ తర్వాత యాజ్ఞవల్క్యుడు గుర్తుకు వస్తాడు. జనకచక్రవర్తి గుర్తుకు వస్తాడు. శ్రీకృష్ణుడు గుర్తుకు వస్తాడు. శుక మహర్షి గుర్తుకు వస్తాడు. వేమన గుర్తుకు వస్తాడు. దయానందుడు గుర్తుకు వస్తాడు. అరవిందుడు గుర్తుకు వస్తాడు. స్వామి సత్య పతి పరివ్రాజక్ గుర్తుకు వస్తాడు. మా గురుదేవులు పండిత గోపదేవశాస్త్రి గుర్తుకు వస్తాడు. యోగం యోగమే. దానికదే సాటి. బ్రహ్మజ్ఞాని కాలేకపోతే ఋషి కాజాలడు. ఋషి కాకపోతే సంన్యాసి కాజాలడు. సంన్యాసి కాలేకపోతే యోగి కాజాలడు. యోగి కాలేకపోతే సమాధ్యవస్థకు అర్హుడు కాజాలడు. సమాధి సిద్ధించకపోతే పరమాత్మ సాక్షాత్కారానికి అర్హుడు కాజాలడు. కనుక మానవుడు ప్రప్రథమంగా జ్ఞాని కావాలి. అందుకు ప్రకృతిపురుష వివేకాన్ని సంపాదించుకోవాలి. దర్శనకారుల్లో గౌతముడు జ్ఞాని. కణాదుడు జ్ఞాని. కపిలుడు జ్ఞాని. జైమిని జ్ఞాని. వ్యాసుడు జ్ఞాని. పతంజలి మహాజ్ఞాని.

మహర్షి పతంజలి లోకోద్ధరణకై మూడు పనులు చేపట్టాడని,

పతంజలి రచించిన గ్రంథాలు మూడు అవి:

**ఒకటి: యోగదర్శనం - ఇది చిత్తశుద్ధికి ఉపయోగపడుతుంది.**

**రెండు: మహాభాష్యం - ఇది వాక్ శుద్ధికి ఉపయోగపడుతుంది.**

**మూడు: చరకసంహిత - ఇది శరీరశుద్ధికి ఉపయోగపడుతుంది.**

మనస్సు, వాక్కు, శరీరంఈ మూడింటిని త్రికరణాలంటారు. వీటిని మానవుడే విధంగా శుద్ధి చేసుకోవాలో ఈ గ్రంథాలు సంపూర్ణంగా తెలియజేస్తాయని

పతంజలి ఏ కాలంవాడో, ఎక్కడివాడో చెప్పడం కష్టమని అతడు భారతీయుడు కావడం మన అదృష్టం అంటాడు."ఆర్షకవి" ఆచార్య మసన చెన్నప్ప " సంపూర్ణ యోగ దర్శనం" గ్రంథంలో.


భారతీయ సనాతన సంప్రదాయ విద్యల్లో యోగ అతి ప్రధాన మైంది. వేద వాఙ్మయమైన ఉపనిషత్తుల నుండి పుట్టి, దర్శన స్థాయికి ఎదిగిన దివ్యమైన కళ ఇది. మన శరీరమును, మనస్సును క్రమ బద్ధీకరించి ప్రాపంచిక ప్రయోజనాన్ని, ఆత్మను పరమాత్మను ఏకం చేసే పారమార్థిక ప్రయోజనాన్ని సమకూర్చే ఇహపర సాధనం 'యోగ' మానవులు మానసిక ఒత్తిడి నుండి బయట పడాలన్నా, రుగ్మతల నుండి నివారణ పొందాలన్నా యోగాభ్యాసం ఒక పరమ ఔషధం. మనిషి జీవించి ఉన్నంత కాలం మరొకరికి భారం కాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనుకోవడం ఒక చక్కటి ఆరోగ్య కరమైన మంచి ఆలోచన. ఇది యోగాభ్యాసంతోనే సాధ్యమవు తుందనడం అతిశయోక్తి కాదు.

మానవ ఆరోగ్యాన్ని పెంపొందించే ప్రాచీన భారతీయ సాధన యోగ శరీరంపై పట్టు సాధించడం కోసం యోగ అనే ప్రక్రియను ప్రాచీన కాలంలో తాంత్రికలు ప్రారంభించారు. ఈ యోగాసనాలు శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడమే కాక నిద్రలేమి మానసిక ఒత్తిడి జీవనశైలి సంబంధిత వ్యాధులను తగ్గించడంలో సహాయపడతాయి ప్రాచీన గ్రంథాలు 'పతాంజలి యోగ సూత్రాలు" మొదలైన పుస్తకాలు కూడా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచే ప్రక్రియగా దీన్ని వివరిస్తాయి.

పతాంజలి చేత చెప్పబడిన అష్టాంగయోగం ముముక్షులైన యోగ సాధకులకు అవశ్యం అనుసరింపదగింది.'యోగా' అనే తపో ఫలాన్ని భావితరాలకు అందించాడు. పతంజలి మహర్షి. యోగాలో హఠయోగ, రాజయోగ, భక్తియోగ, కర్మయోగ, సాంఖ్యయోగ, కుండలినీ యోగ, జ్ఞాన యోగ తది తరములు కాగా ప్రస్తుతం ఆచరణలో ఉన్నది రాజ యోగము. దీనినే అష్టాంగ యోగము అవి కూడా అంటారు. ఈ అష్టాంగ యోగము ద్వారా మానవుని పంచ కోశముల ను శుభ్రపరచవచ్చును.

ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య మసన చెన్నప్ప గారు తన" సంపూర్ణ యోగ దర్శనం" బృహత్ గ్రంథంలో మహర్షి పతాంజలి విరచిత యోగ దర్శనానికి వేదానుకుల వ్యాఖ్యానం చేస్తూ... యోగ సాధన చేసే మనుష్యుడు తన బుద్ధిని బ్రహ్మజ్ఞానం కోసం మొదట్లో పరమేశ్వరునిలో లగ్నం చేస్తాడు పరమేశ్వరుడు అతని బుద్ధిని దయగలిగినవాడై తనలో యుక్త పరుస్తాడు. అప్పుడు సాధకుడు పరమేశ్వరుని ప్రకాశం లోనే ఉంటాడు ఇదే ప్రపంచంలో యోగికి వర్తించే లక్షణమని, ఎడతెగకుండా యోగాభ్యాసం చేయడం వల్ల సాధకునికి క్రమంగా శారీరక మానసిక శక్తులు దృఢమై సర్వప్రాణుల పట్ల మైత్రి భావం కలుగుతుంది. అందువల్ల యోగసాధకుడు తనను రక్షించేవాడు పరమేశ్వరుడనే పూర్ణ విశ్వాసముతో ధ్యానిస్తాడు. అమృత సిద్ధి కోసం అర్థిస్తాడు. మనకు ప్రపంచ పదార్థాలలో గల సంబంధం నిత్యమైంది కాదు పరమేశ్వనితో గల సంబంధమే నిత్యం అయింది ఈ సంబంధం ఎల్లకాలం ఉంటుంది ఈ సంబంధం ఎప్పుడూ తెగిపోదు అందుకే మనుషుడు యోగ ద్వారా ఈశ్వర సాక్షాత్కారం చేసుకొని పూర్ణానందం పొందుతాడు. యోగ మహిమ గొప్పది ఎవరైనా దాని మూలంగానే సమస్త సుఖదుఃఖాల నుంచి బయటపడి మోక్షానం దాన్ని పొందే అవకాశం ఉంది. యోగసాధకుడు ప్రారంభంలో యమ నియమాలను పాటించాలి ప్రకృతి జీవేశ్వరుల యదార్థ స్వరూపాన్ని తెలుసుకోవాలి ఆసన్న ప్రాణామయాలను అలవర్చుకోవాలి మనో నిగ్రహం వల్లనే ఇంద్రియాలతో ఇంద్రియ విషయాలతో ఆత్మకు గల సంబంధం తొలగిపోతుందని, సాధకుడు సంప్రజ్ఞాత యోగాన్ని అభ్యాసం చేసే కొలది తాను పరిపక్వస్థితికి చేరుకొని సమస్త దు:ఖాలనుంచి విముక్తుడు నయ్యానని భావిస్తాడని, అప్పుడు అతనికి వాస్తవిక స్వరూప జ్ఞానంలో స్థితి కలిగి చిత్త ప్రవత్తులు నశించడం వల్ల అతడు ప్రకృతిలో వర్తించడం నటించడం మాని తనలో తానున్నతుడై పరమాత్మలో ఆనందాన్ని అనుభవిస్తూ స్వతంత్రుడై నిర్భయుడై ప్రళయ కాలం వరకు శాశ్వతమైన ఆనందాన్ని అనుభవిస్తాడని వివరించాడు.

మనోమయ కోశ యమ, నియమ, రోగములు రాకుండా చూచుకొనుట, అన్నమయ కోశ, ఆసన, క్రియ, ముద్రలు వచ్చి రోగాలను పోగొట్టుకొనుట, ప్రాణవాయు కోశ ప్రాణాయామము ఆనందమయ కోశః ప్రత్యాహార జ్ఞాన అభివృద్ధి జ్ఞానమయ కోశ 'ధారణ, ధ్యాన, సమాది, మనోమయ కోశము యమ: అహింస, సత్య, ఆస్త్రీయ బ్రహ్మచర్య, అపరి



గ్రహ,
వీ టి
ఆచరణ కూడా

ఐదు ముఖ్యాంశాలుగా గుర్తించుకొన్నచో ఆచరణ సులభమగును. అవి మనసా, వాచా, కర్మణా, అంతరాత్మ హెచ్చరికను, పాటించుట, సమతౌల్యము పాటించుట, వర్గీకరించి ముఖ్యమైన దానిని పాటించుట; హద్దులు మొదలగునవి.

**బ్రహ్మచర్యము**

బ్రహ్మచర్యము అనగానే ఎక్కువ మంది భార్యాభర్తల సంబంధం గానే భావిస్తారు. కానీ యోగ శాస్త్రము ప్రకారం మన రక్తము రూపాంతరం చెంది 'ఓజస్' అనే పదార్థము తయారవుతుంది. ఇది మన పెరుగుదలకు, శారీరక శక్తికి, అందమునకు, జ్ఞాపకశక్తి, జ్ఞానశక్తులు పెరుగుట మొదలగునవి అన్నింటి అభివృద్ధికి ఈ ఓజస్సే మూల కారణం. ఈ ఓజస్ అర్థరహిత కోరికలేవైనను, మానసిక వత్తిడిని ఎక్కువ కలిగినచో వృథా అగును. ఈ ఓజస్ లైంగిక విషయంలో కలిగెడి మానసిక ఒత్తిడికి ఎక్కువ మోతాదులో నాశనమగును. అందువలననే ఈ విషయమునకు ఎక్కువ ప్రాముఖ్యత నిస్తారు. కానీ ఏ కోరికకు మానవులు బానిసలైనను ఈ ఓజస్ క్షీణించి అంద విహీనులు, జ్ఞాన హీనులగుదురు. అంతేగాక అనేక రోగాలకు దగ్గర బంధువులగుదురు. బలహీనులగుదురు.

**పై సిద్ధాంతాలు పాటిస్తే వచ్చే లేభాలు:**

1. ఆత్మస్థైర్యం (ఉత్సాహము, సాహసము, ధైర్యము)
2. మానసిక, శారీరక, ఆరోగ్యము అనగా పరిపూర్ణ ఆరోగ్యము చేకూరును
3. ఏకాగ్రత చేకూరును.
4. జ్ఞాపకశక్తి అభివృద్ధి అగును.
5. జ్ఞానశక్తి ఇతరుల కంటే ఎన్నో రెట్లు అధికమగును.

**నియమాలు:** సౌచ, సంతోష, తపస్సు, స్వాధ్యాయ, ఈశ్వర, ప్రణిధానాని

**శౌచ:** మానసిక, శారీరక శుభ్రత శరక్రియలు మొదలగు క్రియల వలస బాహ్య, అంతర్గత శరీరమును శుభ్రపరచుకొన వచ్చును సిద్ధాంతాలను అవగాహన చేసుకొని వాటిని నిత్య జీవితంలో ఆచరణలో వుంచిన మానసిక శుభ్రత కలుగును.

**సంతోషం:** ఎల్లప్పుడు సంతోషముగా ఉండుట వలన మానసిక ఆందోళన తగ్గి జబ్బులకు గురికాకుండా విలువైన జీవితమును వెలిబుచ్చవచ్చును. ఈ ప్రకృతిలో చావుపుట్టుకలు సుఖదుఃఖాలు సర్వ సాధారణము, ఎల్లప్పుడూ వుండునవే. కావున లాభదాయకమైన సంతోషమున జీవితాన్ని పూర్తి చేయుట శ్రేయస్కరము.

**తపస్సు:** తాప్ అనునది సంస్కృత పదము. తాప్ ఉష్ణము.అగ్ని అనునది కల్మషములను పూర్తిగా నాశనము చేయునది. మానవుడు తనలో ఉన్న కల్మషములను నాశనమొనర్చుటకు ఏ రకమైన అగ్ని వేసుకొనవలసిన పనిలేదు. అయితే తన ఆలోచనలో పరి పక్వముతో సత్యాన్ని దగ్గరగా తన ప్రవర్తనను మార్చుకొన్నచో తనలో ఉన్న కల్మషములన్నియు నాశనమగును. సత్యాన్ని తన నిత్య జీవితములో ప్రతి నిమిషమూ పాటించాలి.

**స్వా అధ్యాయ:** పరిమిత జ్ఞానానికి, అపరిమిత జ్ఞానానికి తేడా గుర్తించి, జ్ఞాన ఆవశ్యకతను గుర్తించి, జ్ఞానార్జనకు చేయు ప్రయత్నమే స్వా అధ్యాయమగును.

ఈశ్వర ప్రణిధానాని: లాభ నష్ట ఫలితాలన్నింటిని ఈశ్వరునికి అర్పించుట ఎందుకంటే లాభాలు, జయాల వలన కలిగే అహంకారం మానవుని జీవితపు దారిలో అడ్డుగోడగును. ఈ అడ్డుగోడను తొలగించి ముందు కెళ్ళుటకు మానవుడు క్రియా ఫలితాలపై ఆశ వదలుకొనవలెను. ముఖ్యంగా నమతా స్థితిని పాటించవలెను. దీని వలన మానవుని మెదడుపై ఏరకమైన ఒత్తిడి లేక రోగాలు దరి చేరవు. అంతేకాకుండా ఉన్న రోగాలు కూడా నయమవుతాయి. మనస్సు ఉల్లానము వలన జ్ఞాన సంపాదన మార్గము సుగమమగును.

**ఆసన:** స్థిరం సుఖమాసనమ్ స్థిరత్వము, సుఖముగా నున్న (ఏ స్థితియైనను ఆసనమనబడును. ఈ ఆసనములు నాలుగు విధములైన పేర్లతో గుర్తింపబడినది.

1. వస్తువుల ఆకారాలు, వజ్రాసిన, చక్రాసన,
2. శారీరక అవయువాల పొందిక కిర్వాతన, నరాలు
3 పశుపక్ష్యాదుల పేర్లతో ఇపోతాసన, ఉపాసన,
4. కనుగొన్నవారి పేర్లతో మత్స్యేంద్రాసన
3. ఈ ఆసనములు జీవకోటి ఎన్ని ఉన్నాయో అన్ని యి కానీ మానవుని ఆరోగ్య రీత్యా 32 ఆసనములుకలవు.

10 సంవత్సరములు పైబడిన వయస్సు వారైనా చ ఆసనములు గురుముఖముగా చేయవచ్చును.

**ఆసనములు చేయుటకు పాటించవలసిన నియమాలు**

1. ఆహారము తీసుకున్న తరువాత మూడున్నర గంటల వ్యవధి ఉండాలి. ఆసనములు చేసిన తర్వాత అర్ధగంట వ్యవధి ఉండాలి.
2 చాప లేదా కార్పెట్ పై ఆసనాలు వేయాలి.
3. ఆసనములకు ముందే స్నానము చేయాలి.
4. నియమిత కాలములో ప్రతిరోజూ ఒకసారి మాత్రమే సాధన చేయాలి
5. గాలి పీల్చుట, వదులుట ముఖ్యంగా పాటించాలి.
6. ఆడవారు పీరియడ్స్, గర్భము దాల్చిన తర్వాత సాధన చేయకూడదు.

ఏరకమైన నొప్పులైనను 15 రోజులలోపు చిన్న భిన్ను, ఆసనములతోనే పోగొట్టుకొనవచ్చును. ఏ ఆసనమైనను గురువు దగ్గర నేర్చుకొనవలెను.

**ప్రాణాయామము** మానవునిలో యోగశాస్త్రము ప్రకారము 72 వేల నాడులు కలవు. ఇందులో చాలా ముఖ్యమైన మూడు. అవి ఇడ, పింగళ, సుషుమ్న నాడులు, ఇదనాడి ఎడును. ముక్కు నుండి ప్రారంభమై వెన్నెముకను చుట్టుకుంటూ వెన్నెముక చివరన కుడి టెస్టికల్స్ కలియును, పింగళ నాడి కుడి ముక్కు నుండి ప్రారంభమై వెన్నెముకను చుట్టుకుంటూ ఎడమ టెస్టికిచ్చేలో కలియును, ఇడ, పింగళనాధులు కలిసిన చోటు నుండి వెరైనుక ద్వారా తల పైభాగమునకు చేరును. ఎడమ ముక్కునుండి బాగా గాలి వచ్చిపోయినదో శరీరము చల్లబడును. కుడి ముక్కునుండి గాలి బాగా వచ్చిపోయినదో శరీరము వేదెక్కును. రెండు ముక్కులు సమానముగా పనిచేసిన సుషుమ్న నాడి పని చేయును. ఈ సుషుమ్న నాడి ప్రతి ఒక్కరిపోదు. చాలా తక్కువ కాలము పని చేయును. ఇందుమూలముగా అన రోగ్యము జీవిత కాల పరిమితి చాలా తక్కువగును, ప్రాణాయామముల పలురకములు కలవు. సూర్య భేదన, భస్త్రిక, నాడీశోధన, శీతలి, చీత్కారి, భ్రమరి, ఉజ్జాయి మొదలగునవి. కానీ వీటిని గురుముఖముగా నేర్చుకొనవలెను. లేనిచో వీటివలన లేని రోగములు కూడా వచ్చును. సరైన ప్రాణాయామములవలన రక్తశుద్ధి, రక్త ప్రసరణ జరుగును. తద్వారా రక్తపోటు తగ్గును. అంతేకాకుండా గురువు మాత్రమే ఏ రకము జబ్బుకు ఏరకపు ప్రాణాయామం అవసరమో తెలియజేయును.

**ప్రత్యాహార:** జ్ఞానేంద్రియాలను అదుపులో ఉంచుకొనుట,

జ్ఞానేంద్రియాల వలన కలిగెడి కోరికలు ఏవి అర్థవంతమైనవో ఏవి అర్థవంతము కావో తెలుసుకొని అర్థవంతమైనవి కూడా సమతా స్థితిలో వుంచుకొన్నట్లయితే అధిక ప్రయోజనము పొందవచ్చని గ్రహించి, కోరికలను ఆచరించినచో ప్రత్యాహారము పాటించిన వారగుదురు.

**ధారణ:** ఏకాగ్రత ఒకే విషయముపై పూర్తి మనస్సును నిలుపుట,

నిద్రించునపుడు మనము గాలిపీల్చుట, వదలుటను గమనానికి రాకున్నను జరుగుచున్నదని తెలియును. అదే విధంగా ఆసన స్థితి యందు కూడా గాలి పీల్చుట, వదలుట దాని పాటికి అది జరుగుచుండును. ఇలా తటస్థీకరింపబడిన ఆసన స్థితిలో గురువు చేత ఉపదేశింపబడిన మంత్రమును అంతర్గతంగా మననము చేసిన మనస్సును ఒకే విషయంపై కేంద్రీకరించుటకు వీలగును.

**ధ్యాన:** ధ్యానము ఏకాగ్రతను ఎడతెగకుండా పొడిగించుటయే

**ధ్యానమగును:** ఈ ధ్యానమును ముఖ్యంగా నాలుగు ఆసనములలో చేయుదురు. వజ్రాసన, స్వస్తికాసన, పద్మాసన, సిద్ధాసన. ఇందులో పద్మాసన చాలా శ్రేష్టమైనది. వజ్రాసన, స్వస్తికాసన శ్రేష్టమైనది. పద్మాసన యోగులకు సిద్దాసన. ఈ ధ్యానము బహిర్గత విషయములపై అంతర్గత విషయాలపై, సూక్ష్మ విషయాలపై వరుస క్రమములో చేసినచో శారీరక బాధలను తొలగించుకుని మనస్సును తటస్థీకరించి, అంతర్గతమునకు మళ్లించుటకు వీలగును. ఏది ఏమైనప్పటికి గురూపదేశముచే నిరంతరము ఎడతెగకుండా ఇష్టపూర్వకంగా సాధన చేయవలసి వుండును.

**సమాధి:** ధ్యానమును ఎడతెగకుండా పొడిగించుటయే సమాధి

యగును. ఇందులో మనస్సు శారీరక బాధల నుండి పూర్తిగా విముక్తి నొందును. ఈనాడు ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది యోగను అభ్యసిస్తున్నారు. ఈ యోగాసనాలు పాటిస్తే ఆత్మస్థైర్యము, సాహసము, మానసి, శారీరక ఆరోగ్యము, ఏకాగ్రత చేకూరి జ్ఞాపక శక్తి అభివృద్ధి అగును.

పతంజలి మహర్షి తన యోగ తపోఫలాన్ని భావితరాలకు అందించిన ధన్యజీవి.

**( యోగ కార్యక్రమాలు జరుగుతున్న సందర్భముగా అందరికీ శుభాకాంక్షలతో..)**




" కావ్యసుధ "
'వాఙ్మయ భూషణ'
" సాహితీ శిరోమణి "
'ఆధ్యాత్మిక సాహిత్య సామ్రాట్'
" ఆధ్యాత్మిక సాహితీ వ్యాస భూషణ్ "
9247313488 : హయత్ నగర్ :
హైదరాబాదు


## కొంచెం నవ్వండి..! కొంచెం నడవండి..!!



కాస్త క్రమశిక్షణతో
ధ్యానం వ్యాయామం చేస్తే...
నిత్యం యోగాసనాలు వేస్తే...
పోయేదేముంది చెప్పండి...
అశాంతితో రగిలే మనసులో కాస్త
ప్రశాంతత ప్రవహించడం తప్ప..!

శారీరక మానసిక ఆందోళన ఒత్తిడి
మొండి వ్యాధులు తొలగడం తప్ప..!
"ఆరోగ్య దీపం" వెలగడం తప్ప..!

ఆనందం ఆయుష్షు
వ్యాధి నిరోధక శక్తి
పంచేంద్రియాలపై
నియంత్రణ పెరగడం తప్ప..!
మానసిక స్థైర్యం
ద్విగుణీకృతం అవడం తప్ప..!

మంచితనం
మానవత్వం
ప్రతి మనిషిలో
పరిమళించడం తప్ప..!

మృగత్వం నుండి
మృదుత్వం వైపు
దానవత్వం నుండి
దైవత్వం వైపు
మనిషి మళ్ళడం తప్ప..!

"వద్దు వద్దు యుద్ధ కాంక్ష
"శాంతియే శ్రీరామ రక్ష" అంటూ
"ప్రేమమంత్రాన్ని" జపించడం తప్ప..!

మారణహోమం నుండి
మతసామరస్యం వైపు
"పశ్చాతాపంతో" పయనించడం
తప్ప...!

అందుకే మిత్రులారా..!
కొంచెం నవ్వండి...
కొంచెం నడవండి...
కొంచెం యోగా చెయ్యండి...
అనువైన ఆసనాలు వేయండి...
ధ్యానం వ్యాయామం చేయండి...
సూర్యనమస్కారాలు చేయండి...!

చేస్తే వేస్తే క్రమశిక్షణతో...
ఆయుష్షు మీ పచ్చని పంటే...
ఆనందం మీరు నచ్చిన వంటే...
ఆరోగ్యం అనునిత్యం మీ వెంటే...
యోగా విలువను తెలుసుకుంటే...
మీ ఇంటమ్రోగేది సుఖజీవన జేగంటే..!


రచన:
కవి రత్న
సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్
పోలయ్య కూకట్లపల్లి
అత్తాపూర్ హైదరాబాద్

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
తెలుగు దిన పత్రిక



## ఎస్సై గా పదోన్నతి పొందిన పోలీస్ అధికారిని అభినందించిన పోలీస్ కమిషనర్

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఖమ్మం పోలీస్ కమిషనరేట్ లోని పలు పోలీస్ స్టేషన్లలో వివిధ హోదాలలో భాధ్యతలు నిర్వహించి... అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్సై) గా భాధ్యతలు నిర్వహిస్తూ.. (ఎస్సై) సబ్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ పై వెళ్తున్న యం. సూర్యనారాయణ, యం.కమలాస్ బేగ్ , విఆర్ రాఘవయ్య ను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- పార్టీకి ద్రోహం చేసిన వారికి విజయంతో గుణపాఠం చెప్పాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ శ్రేణులు గెలుపే లక్ష్యంగా పని చేయాలని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. కన్న తల్లి లాంటి పార్టీతో అన్ని ప్రయోజనాలు పొంది పార్టీకి ద్రోహం చేసిన వారికి స్థానిక సంస్థలు ఎన్నికల్లో విజయంతో గుణపాఠం చెప్పాలన్నారు. శుక్రవారం పెద్దమందడి మండలం అమ్మపల్లి గ్రామంలో పెద్దమందడి మండలం, అడ్డాకుల మండల ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హాజరై బిఆర్ఎస్ శ్రేణులకు రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దేశానిర్దేశం చేశారు. పార్టీ శ్రేణులు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యమనాటి పోరాట స్ఫూర్తి ప్రదర్శిస్తామని కన్నతల్లిలాంటి పార్టీతో అన్ని ప్రయోజనాలు పొంది ద్రోహం చేసిన నాయకులకు గుణపాఠం వచ్చేలా స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయ ధూందుభి మ్రోగిస్తామని ప్రతిన బునారు. నాయకులకు దిశా నిర్దేశం చేసిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరిలో పార్టీ పట్ల నిబద్ధత నాయకుని పట్ల విధేయత ప్రజల పట్ల విశ్వాసంతో పనిచేస్తే విజయం మనదే నని అన్నారు.ప్రతి బి.ఆర్.ఎస్ కుటుంబ సభ్యునికి తాను అండదండగా ఉంటానని నా చుట్టూ తిరగకుండా ప్రజల చుట్టూ తిరగాలని అప్పుడే మీకు,పార్టీకి భవిష్యత్తు ఉంటుందని అన్నారు.మండల నాయకులు ప్రతి గ్రామము తిరిగి రావాలని ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకొని వారికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు.తనక ఏమాత్రం అనుమానం లేదని ఈసారి పెద్దమందడి స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని పునరుద్ఘాటించారు.ఈ సమావేశములో మాజీ జడ్పిటిసి రఘుపతి రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు వేణు యాదవ్,మాజీ ఎం.పి.పి మన్నెపు రెడ్డి,నగ్గేంద్రం యాదవ్, మాజీ ప్రజా ప్రతినిధులు,గ్రామ పార్టీ అధ్యక్షులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటి కెసిఆర్ కు అండగా నిలుద్దాం

- ఖిల్లా ఘనపూర్ బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

వనపర్తి జిల్లా ఖిల్లా ఘనపూర్ మండల బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం పార్టీ అధ్యక్షులు రాళ్ళ కృష్ణయ్య స్వగృహంలో జరిగింది. శుక్రవారం ఇట్టి సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలి అని మండల నాయకులు గ్రామాలలో పర్యటించి ప్రజలతో మమేకం కావాలని 19నెలల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి ప్రజలకు చేరువకావాలని పిలుపునిచ్చారు. ప్రజల మన్ననలను పొందిన నాయకులను గుర్తించి వారికి అవకాశం ఇవ్వాలని అన్నారు. పార్టీ పట్ల నిబద్ధత, నాయకుని పట్ల విశ్వాసం ఉన్న నాయకులకు పార్టీ అవకాశం ఇస్తుందని అన్నారు. పార్టీలో ఉంటూ ఇతర పార్టీలకు సహకరించే నమ్మకద్రోహుల పట్ల పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజలు స్థిర నిర్ణయానికి వచ్చినారని కెసిఆర్ హయాములో జరిగిన సంక్షేమం నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు ఎట్లా నిర్వీర్యం అయినాయో స్పష్టమైన అవగాహనతో ఉన్నారని అన్నారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యల పట్ల స్పందిస్తూ వారికి అండగా నిలవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ ఎంపిపి కృష్ణా నాయక్, మాజీ మార్కెట్ చైర్మెన్ లక్ష్మారెడ్డి, మాజీ జడ్పీటీసీ సామ్యా నాయక్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ బాలేశ్వర్ రెడ్డి, ఎస్.టి సెల్ జిల్లా నాయకులు జాత్రు నాయక్, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పూర్తిగా విఫలమైన ప్రాజెక్టు

**– పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ విమర్శ**

**పెద్దపల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దపల్లి జిల్లా సుందిళ్ల వద్ద పార్వతి బ్యారేజ్‌ను సందర్శించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా విఫలమైనదని, ఇది వ్యవసాయానికి ప్రయోజనం కాకుండా భారం అయ్యిందని చెప్పారు.

నీళ్లు, నిధులు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల మోతాదులో ముంచిందని మండిపడ్డారు. surplus బడ్జెట్‌తో ఉన్న తెలంగాణను లక్షల కోట్ల రుణాల పాలైె రాష్ట్రంగా మార్చిన బాధ్యత అప్పటి పాలకులదేనని అన్నారు.



లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు కాళేశ్వరం నిర్మించామని చెప్పిన వారు, చివరకు ఒక్క చుక్క నీరు కూడా రైతులకు అందించలేకపోయారని ఆరోపించారు. అంతటి ప్రాజెక్టు అవసరం లేకుండానే రాష్ట్రంలో వరి పంట రికార్డు స్థాయిలో పండిందని చెప్పారు. ఈసారి ఒక్క ఏడాదిలోనే 1.50 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి కావడం చూస్తే, కాళేశ్వరం నిర్మాణం అవసరమా అని ప్రజలు ఆలోచించాలన్నారు.

పెద్దపల్లి జిల్లా పరిధిలో కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన రూ.2,978 కోట్ల విద్యుత్ బిల్లులు పెండింగ్‌గా ఉన్నాయని, మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి పారుదల ప్రాజెక్టులకు రూ.3,404 కోట్ల మేర విద్యుత్ బిల్లులు బాకీగా ఉన్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం వేసిన ఈ అప్పుల భారం రైతులకు లాభం కన్నా నష్టమే కలిగించిందన్నారు.

బనకచర్ల ప్రాజెక్టుపై స్పందించిన ఎంపీ వంశీకృష్ణ, ఇది నిర్మితమైతే తెలంగాణకు సుమారు 100 నుంచి 150 టి.ఎం.సిల నీటి నష్టం జరుగుతుందని హెచ్చరించారు. డబ్బు దోచుకోవాలనే ఉద్దేశంతోనే కేసీఆర్‌ను అనుసరిస్తూ చంద్రబాబు ఈ ప్రాజెక్టును ప్రారంభించారని ఆరోపించారు. కేంద్ర నీటి సంఘం అనుమతులు లేకుండానే బనకచర్ల పనులు ప్రారంభించడాన్ని ఖండించారు.

రానున్న శీతాకాల సమావేశాల్లో పార్లమెంటులో ఈ ప్రాజెక్టును అడ్డుకునేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవకతవకలపై విచారణ జరుగుతోందని, త్వరలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.




# ఆరోగ్య సమాజానికి యోగా అద్భుత మార్గం

**-మాజీ ఎంపీ నామ**

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు శుక్రవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. యోగా మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, శారీరకంగా మరియు మానసికంగా సమతుల్యం సాధించడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. రోజువారీ జీవనశైలిలో యోగాసనాలు, ధ్యానం, శ్వాసాభ్యాసాలను అనుసరించడం ద్వారా ఒత్తిడి, ఆందోళనల నుంచి విముక్తి లభిస్తుందని వివరించారు. యోగా వ్యక్తిత్వ వికాసానికి, లోతైన ఆలోచనశక్తి పెంపునకు, శాంతి, సౌఖ్యం, ఐక్యతను అందించే శక్తిమంతమైన సాధనమని అభివర్ణించారు. పిల్లల నుంచి వృద్ధుల వరకు ప్రతిరోజూ కనీసం ముప్పై నిమిషాలు యోగా చేయాలని సూచించారు. యువత దీన్ని జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. తన దినచర్యలో భాగంగా ప్రతి రోజు యోగా చేస్తానని నామ తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో చైతన్యం పెంచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో యోగా కార్యక్రమాలను ప్రోత్సహించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని నామ ఆకాంక్షించారు.





# కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అండగా ఉంటా.. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా..

- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- చుంచుపల్లి మండలంలో విస్తృత పర్యటన
- కాంగ్రెస్ ముఖ్య నాయకులతో ఆత్మీయ సమావేశాలు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అండగా నిలుస్తానని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని నందాతండా, ధన్ బాద్, గౌతంపూర్, రుద్రంపూర్, పెనగడప గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాలకు హాజరయ్యారు. మాజీ జెడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ల మురళి, పెదబాబు, జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్ తదితర కాంగ్రెస్ నాయకులతో కలిసి ఎంపీ మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో పార్టీ చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కోరారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో దగా పడ్డ తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టే విధంగా మేనిఫెస్టోను రూపొందించడమే కాక వాటిని సమర్థవంతంగా అమలు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమాల్లో.. చుంచుపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు అంతోటి పాల్, సుజాతనగర్ మండల అధ్యక్షులు చింతలపూడి రాజశేఖర్, కాంగ్రెస్ నాయకుడు జేవిఎస్. చౌదరి, రైల్వే బోర్డు సభ్యులు వై శ్రీనివాస్ రెడ్డి, టెలికాం బోర్డు సభ్యులు బోదాసు కనకరాజు, ఆర్టీఏ బోర్డు సభ్యులు బాదర్ల జోషి, ఐఎన్టియూసి వైస్ ప్రెసిడెంట్స్ ఎండి రజాక్, ఎస్ పితాంబరం, కాంగ్రెస్ నాయకులు బాల పాసి, తలుగు అనిల్, రావి రాంబాబు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ శ్రేణులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, కార్యకర్తలు మహిళలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరం లాంటిదీ

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్ నగర్,తెలంగాణ ముచ్చట్లు:**

నిరుపేదులకు కార్పొరేట్ వైద్యం అందించడంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలకంగా ఉపయోగపడుతోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ శుక్రవారం జరిగిన సమావేశంలో నందిగామ మండలానికి చెందిన జిల్లేల రాంరెడ్డికి రూ.1,60,000 విలువైన చెక్కును ఎమ్మెల్యే చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స అనంతరం గిరిజనులు, దళితులు, నిరుపేదలు ఆర్థిక భారాన్ని ఎదుర్కొనకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. అవసరమైన వారికి వైద్య సహాయం అందేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు బాబర్ అలీ ఖాన్, షాద్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం, పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు సాదిక్, రవికుమార్ గుప్తా, శ్రీధర్ రెడ్డి, సీతారాం, శ్రీహరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు.. విడతల వారీగా మంజూరు
- వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్

పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామానికి చెందిన ఇరికిచెట్టి చెన్నమ్మకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్ సాగర్ కాంగ్రెస్ నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. శుక్రవారం ముగ్గు పోసే కార్యక్రమంలో భాగంగా కొబ్బరికాయ కొట్టి ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ప్రేమ్ సాగర్ మాట్లాడుతూ.. అన్ని వర్గాల పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. మొదటి విడతలు మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వెంటనే ప్రారంభించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్ సాగర్, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్, కుమ్మరి కొండన్న, పట్నం సత్యన్నా, సాగర్, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఇరికిచెట్టి చెన్నమ్మ, నారాయణ పాల్గొన్నారు.





# డిబాట కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించిన ధర్మసాగర్ జెడ్పీ బాలుర పాఠశాల

- పూర్వ విద్యార్థి బీర సతీష్ ద్వారా క్రీడాసామగ్రి వితరణ

ధర్మసాగర్,తెలంగాణ ముచ్చట్లు:



ధర్మసాగర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమం జూన్ 5 నుండి 19 వరకు విజయవంతంగా సాగింది. విద్యార్థుల చొరవ, ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమం శ్రద్ధాశక్తులతో కొనసాగింది.
ప్రతిరోజూ రూపొందించిన కార్యాచరణ ప్రకారం తల్లిదండ్రుల సమావేశాలు, విద్యార్థుల కోసం ఇంటింటి ప్రచారం, గ్రామసభలు, విద్యాభిమానులతో చర్చలు, ర్యాలీలు, స్వాగతోత్సవాలు, లర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం, సహిత విద్య, బాలిక విద్య దినోత్సవం సందర్భంగా సెమినార్లు నిర్వహించాయి. ముగింపు రోజున క్రికెట్, సాఫ్ట్‌బాల్ వంటి బహుళ మంది పాల్గొనే క్రీడలతో పాటు గృహాల మధ్య పోటీలు, గరిటిపాటి ఆటలు నిర్వహించగా, విజేతలకు బహుమతులు అందజేశారు.
ఈ సందర్భంగా పాఠశాలలోనే చదివి ప్రస్తుతం అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి బీర సతీష్, పాఠశాల విద్యార్థులకు పదివేల రూపాయల విలువైన క్రీడా టీషర్టులను వితరణగా అందజేశారు.
ఈ కార్యక్రమాల విజయవంతానికి ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయుడు ధర్మ ప్రకాష్ నేతృత్వంలోని ఉపాధ్యాయ బృందం సమన్వయంతో కృషి చేసినట్లు పేర్కొనబడింది. గతంలో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాల వైపు మొగ్గుచూపడాన్ని చూసి, ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతికి బద్యతగా పనిచేస్తున్నారని, విద్యారంగంలో ఈ పాఠశాల మరింత పురోగమించబోతుందని అమ్మ ఆదర్శ పాఠశాల చైర్‌పర్సన్ మమత అభిప్రాయపడారు.

# బనకచర్లపై మాట్లాడే నైతిక హక్కు కేసీఆర్ కు లేదు

- ఎమ్మెల్సీ కోదండరాం విమర్శ

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:



బనకచర్ల ప్రాజెక్ట్ అంశంపై భారతీయ జనతా పార్టీ, భారత రాష్ట్ర సమితి మధ్య విభేదాలు ముదురుతున్న తరుణంలో, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం తీవ్ర వ్యాఖ్యలు చేశారు.గోదావరి-జనకచర్ల ప్రాజెక్ట్ పునాదులు తానే వేసి, ఇప్పుడు అదే అంశంపై మాట్లాడే నైతికత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను రక్షించాల్సిన సమయంలో, ఆంధ్ర ప్రదేశ్ పాలకుల వాదనలకే అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణను బలిగా మార్చారని మండిపడ్డారు.
కృష్ణా, గోదావరి నదుల జలాల వినియోగంలో ఉమ్మడి రాష్ట్ర కాలంలోనే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ అంశంపై కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం లోపభూయిష్టంగా వ్యవహరించిందని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన నాగేష్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే నాగరాజు

వర్ధన్నపేట,తెలంగాణ ముచ్చట్లు :




వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత అంకేశ్వరపు నాగేష్ ఇటీవల బైకు ప్రమాదంలో గాయపడ్డారు. ఆయనను హనుమకొండ సుబేదారి ప్రాంతంలోని రోహిణి ఆసుపత్రిలో శుక్రవారం పరామర్శించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. గాయపడిన నాగేష్‌కు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి సూచనలు ఇచ్చారు. బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు హాజరయ్యారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో గుగులోత్ రాజు నాయక్‌కు డాక్టరేట్

- సన్మానించిన బంజారా సంక్షేమ సంఘం ప్రతినిధులు

హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:



కాకతీయ విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగంలో గుగులోత్ రాజు నాయక్ డాక్టరేట్ పొందిన సందర్భంగా హనుమకొండ జిల్లా కేంద్రంలో బంజారా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం నిర్వహించారు. విద్యార్థి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ, గిరిజన వర్గాల హక్కుల కోసం పోరాటం చేస్తూ, అనేక సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలపై మద్దతుగా నిలిచిన రాజు నాయక్‌కు డాక్టరేట్ లభించడం గర్వకారణమని పాల్గొన్న ప్రముఖులు అభిప్రాయపడ్డారు.
ఈ కార్యక్రమంలో బంజారా సంక్షేమ సంఘం అధ్యక్షుడు వి.ఎన్. నాయక్, డాక్టర్ చందు నాయక్, లావుడియా రాజు నాయక్, జర్నలిస్ట్ సాంబయ్య నాయక్, కార్వాష్ నరసింహా నాయక్, నిర్మాణ రంగానికి చెందిన రవీందర్ కిషోర్ నాయక్, ఉపాధ్యాయుడు రాజు నాయక్, రాజేష్ నాయక్, మదన్ నాయక్, మురళి నాయక్, అర్పిత నాయక్, ప్రొఫెసర్ సురేష్ లాల్, లోక నాయక్, వినోద్ బానోత్, వెంకట్ నాయక్, బాదావత్ బాలాజీ నాయక్, భాస్కర్ నాయక్, అజ్మీర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. డాక్టరేట్ పొందిన గుగులోత్ రాజు నాయక్‌ను శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రాజు నాయక్ మాట్లాడుతూ, కార్యక్రమానికి హాజరైన ప్రతిఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. తన విద్యా ప్రగతికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి ఋణపడి ఉన్నానని తెలిపారు.




# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు

హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:



దేశంలో పుట్టిన యోగా విశ్వ వ్యాప్తం కావడంతో భారతీయులందరికీ గర్వకారణమని , యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని వరంగల్ జిల్లా కోర్టు సూపరింటెండెంట్ ఆకుతోట ఇందిరా, పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు. అనంతరం జూన్ 21 అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రోజున బాలసముద్రంలోని చిల్డ్రన్ పార్కులో యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఆకుతోట ఇందిరా, ఈగ వెంకటేశ్వర్లు, మాట్లాడుతూ యోగా మన ప్రాచీన సంప్రదాయం నుండి వచ్చిన ఒక అమూల్యమైన బహుమతి అని చెప్పవచ్చని , యోగా మనసు, శరీరం, ఆలోచన, క్రియల ఐక్యతను సూచిస్తుందని తెలిపారు. యోగా కేవలం వ్యాయామం మాత్రమే కాదని ఇది మీతో, ప్రపంచంతో, ప్రకృతితో ఏకత్వం అనే భావనను కనుగొనే మార్గం" అని అన్నారు. ప్రతి వ్యక్తిత్వాన్ని, వికాసానికి యోగా ఎంతో గొప్పగా సహాయపడుతుందని, ఏకాగ్రతను, జ్ఞాపకశక్తిని పెంచుతుందని అన్నారు. అదే విధంగా యోగా సాధకులు ధ్యానం చేయడం వలన నిలకడతో ఉండాలని యోగా సాధనతో మనిషి చురుకుగా ఉండడమే కాకుండా మానసిక ప్రశాంతతను , ఉత్సవాన్ని పొందుతారని తెలియజేశారు. ప్రతి మనిషి తన దైనందిన జీవితంలో యోగా చేయడం వల్ల దీర్ఘకాలిక రోగాలైనా బిపి, షుగర్, అల్సర్, అస్తమా వివిధ రకాల నొప్పుల నుండి విముక్తి కలుగుతుందని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజూ తన ఆరోగ్యం కోసం యోగా చేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరగడంతో పాటు మానసిక నరాల సమస్యలు రాకుండా నివారిస్తుందని యోగా ఎంత ఎక్కువగా సాధన చేస్తే మానసిక ప్రశాంతత అంతగా పెరుగుతుందని యోగా ఆసనాల వలన రక్తప్రసరణ మెరుగుపడుతుందని సూచించారు. ప్రతి రోజూ యోగా సాధన చేయడం వలన ఆరోగ్యానికి మంచిదని అన్నారు. ప్రతి వ్యక్తి యోగా పట్ల అవగాహనను పెంపొందించుకొని మానసికంగా, శారీరకంగా ఉన్నతగా ఎదగాలని కోరారు.
ఈ కార్యక్రమంలో యోగా టీచర్ బత్తుల రాజేందర్, లకావత్ చిరంజీవి, సదానందం, శివ శంకర్, రవీందర్, నవీన్, శోభ, కళావతి ,సుమ,భాస్కర్ , సురేష్, శ్రీనివాస్,సాయిలు, వేంకటేశ్వర్లు, సునిత, గణేష్ , మంజుల, విజయ, శ్యామల, రోజా, నయనా తదితరులు యోగా సాధకులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనుల్లో జాప్యం జరగరాదు

- సమన్వయంతో పని చేయాలి
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్,తెలంగాణ ముచ్చట్లు:



షాద్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పురోగతిపై ఇరిగేషన్ శాఖ అధికారులతో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...
అభివృద్ధి పనుల్లో జాప్యం చోటుచేసుకోకుండా, సంబంధిత ఇతర శాఖలతో సమన్వయం కలిగి కార్యాచరణ కొనసాగించాలన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సిఎస్ఆర్ నిధుల ద్వారా చేపడుతున్న చెరువుల పునరుద్ధరణ పనులు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.
బిటి రోడ్డు నిర్మాణానికి అవసరమైన మట్టిని సమీప గ్రామాల నుంచి తీసుకునేలా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అలాగే అంచుకుంట ప్రాంతానికి మరుగు నీరు చేరకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్.ఈ మధుసూదన్ రెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సహాయ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇజ్రాయెల్, ఇరాన్ పరస్పర దాడులు ముదురుతున్న యుద్ధం

(మొదటి పేజీ తరువాయి)



ముఖ్యంగా బీర్‌షిబాలోని టెక్నాలజీ పార్కుపై దాడి చేసింది. ఈ ఘటనలో పలు భవనాలకు నష్టం వాటిల్లింది. మైక్రోసాఫ్ట్ కార్యాలయం సమీపంలో మంటలు ఎగసిపడ్డాయి. ఇజ్రాయెల్ సైన్యానికి చెందిన కీలక కార్యాలయాలు ఆ పార్కులో ఉన్నట్లు తెలుస్తోంది. హైఫా నగరంపై ఇరాన్ చేసిన మిసైల్ దాడిలో 23 మందికి గాయాలయ్యాయి. మరోవైపు రాజధాని టెహ్రాన్, ఇరాన్‌లోని ఇతర ప్రాంతాల్లోని పలు లక్ష్యాలపై 60కు పైగా యుద్ధ విమానాలతో ఇజ్రాయెల్ దాడులు చేసింది. ఇరాన్ రక్షణ పరిశోధనా సంస్థ కేంద్ర కార్యాలయానికీ నష్టం కలిగించింది. పశ్చిమ ఇరాన్‌లోని కెర్మన్‌షా, తబ్రీజ్ ప్రాంతాలలో ఉన్న బాలిస్టిక్ క్షిపణుల తయారీ కేంద్రాలపైనా 25 యుద్ధ విమానాలతో దాడులు చేసింది. కాస్పియన్ సముద్రం సమీపంలో ఉన్న రాస్త్ నగరంపైనా బాంబులు వేసింది.
ఇరాన్ క్షిపణి దాడితో ఇజ్రాయెల్‌లోని బెట్ యామ్‌లో ధ్వంసమైన నివాస భవనాలు
ఐరోపా నేతలతో భేటీ: ఇరాన్‌పై దాడి చేయాలా లేదా అనే విషయంపై రెండు వారాల్లో నిర్ణయం తీసుకుంటానని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం పేర్కొన్న నేపథ్యంలో ఐరోపా నేతలతో సమావేశం అవ్వడానికి ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాగ్చీ శుక్రవారం జెనీవా చేరుకున్నారు. అక్కడ అనేక గంటల పాటు ఐరోపా, ఇరాన్ నేతల మధ్య చర్చలు జరిగాయి. ఈ చర్చల్ని మరింతగా కొనసాగించాలని ఐరోపా నేతలు అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అదే సమయంలో ఇరాన్ అణ్వాయుధాలు కలిగి ఉండరాదని స్పష్టంగా చెప్పినట్లు బ్రిటన్ విదేశాంగమంత్రి డేవిడ్ లామీ తెలిపారు. అంతకుముందు అబ్బాస్ అరాగ్చీ విలేకరులతో మాట్లాడుతూ.. ఇజ్రాయెల్ దాడులు ఆపనంత వరకు అమెరికాతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ''చర్చలు జరపాలని అమెరికన్లు కోరుకుంటున్నారు. చాలా సందేశాలు పంపారు. దాడులు ఆపనంతవరకు చర్చల ప్రసక్తే లేదని వారికి స్పష్టం చేశాం'' అని చెప్పారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఇంగ్లాండ్‌తో తొలి టెస్టు.. ఓడితే ఈ ముగ్గురే విలన్లు..

జూన్ 24న అంతా స్పష్టమవుతుంది. విరాట్‌రోహిత్, అశ్విన్ లేకపోవడంతో టీం ఇండియా బలహీనంగా కనిపిస్తుందని, దీని కారణంగా 18 సంవత్సరాల తర్వాత ఇంగ్లాండ్‌ను ఇంగ్లాండ్‌లో ఓడిరచడం కష్టమని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. శుభ్‌మాన్ గిల్ నాయకత్వంలోని టీం ఇండియా మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఓడిపోతే, ఈ ముగ్గురు ఆటగాళ్లను అతిపెద్ద దోషులుగా పరిగణించవచ్చని అంటున్నారు. జూన్ 20న భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య మొదటి మ్యాచ్ జరుగుతుంది. మ్యాచ్ ప్రారంభం కావడానికి ఇంకా కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉన్నాయి. లీడ్స్‌లోని హెడిరగ్లీ మైదానం ఈ మ్యాచ్‌ను స్వాగతించడానికి సిద్ధంగా ఉంది. రెండు జట్లు విజయం కోసం పోటీ పడుతున్నాయి. కానీ, జూన్ 24న అంతా స్పష్టమవుతుంది. విరాట్‌రోహిత్, అశ్విన్ లేకపోవడంతో టీం ఇండియా బలహీనంగా కనిపిస్తుందని, దీని కారణంగా 18 సంవత్సరాల తర్వాత ఇంగ్లాండ్‌ను ఇంగ్లాండ్‌లో ఓడిరచడం కష్టమని క్రీడా నిపుణులు భావిస్తున్నారు. శుభ్‌మాన్ గిల్ నాయకత్వంలోని టీం ఇండియా మొదటి టెస్ట్ మ్యాచ్‌లో ఓడిపోతే, ఈ ముగ్గురు ఆటగాళ్లను అతిపెద్ద దోషులుగా పరిగణించవచ్చని అంటున్నారు. రోహిత్ శర్మ పదవీ విరమణ తర్వాత, శుభ్‌మన్ గిల్‌ను కెప్టెన్‌గా ఎంపిక చేశారు. అతను భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగే 5 మ్యాచ్‌ల సిరీస్‌కు కెప్టెన్ పాత్ర పోషించనున్నాడు. అతని భుజాలపై ఒకటి కాదు, రెండు బాధ్యతలుంటాయి. ఎందుకంటే, కెప్టెన్ పాత్ర సులభం కాదు. అతను Iూలో కెప్టెన్‌గా ఉన్నాడు. కానీ, గిల్‌కు అంతర్జాతీయ క్రికెట్ అనుభవం లేదు. ఇంగ్లాండ్ వంటి జట్టుకు కెప్టెన్‌గా ఉండటం అతనికి సవాలుగా ఉంటుంది. అతని భుజాలపై



పరుగులు సాధించాల్సిన పెద్ద బాధ్యత ఉంటుంది. అతను మిడిల్ ఆర్డర్‌లోకి వస్తే, గిల్ విరాట్ కోహ్లీ లాంటి యాంకర్ పాత్రను పోషించాల్సి ఉంటుంది. కానీ, ఇంగ్లాండ్‌పై శుభ్‌మాన్ బ్యాటింగ్ గణాంకాలు చాలా నిరాశపరిచాయి. అతను ఇంగ్లాండ్‌లో 3 మ్యాచ్‌లు ఆడాడు. ఇందులో అతను 14.66 సగటుతో 88 పరుగులు మాత్రమే చేశాడు. ఇంగ్లాండ్ పర్యటనలో గిల్ మొదటి మ్యాచ్‌లో పరుగులు సాధించకపోతే, ఓటమికి కూడా అతను బాధ్యత వహించవచ్చు. ఇంగ్లాండ్ పర్యటనలో సీనియర్ ఆటగాళ్ళు జట్టులో లేరు. కానీ, అనుభవజ్ఞులైన బ్యాట్స్‌మన్ కేఎల్ రాహుల్, అనుభవజ్ఞులైన బౌలర్ జస్ప్రీత్ బుమ్రా ఈ పర్యటనలో సీనియర్ ఆటగాళ్ళుగా జట్టులో చేరారు. రోహిత్ శర్మ లేనప్పుడు కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించవచ్చు. అతను ఇంతకు ముందు చాలాసార్లు భారతదేశం తరపున ఓపెనర్‌గా కూడా ఉన్నాడు. కానీ, ఇంగ్లాండ్ బౌన్సీ పిచ్‌లపై అతను ఎలా ఆడతాడు అనేది చాలా ముఖ్యం. అతను గత సంవత్సరం 9 టెస్ట్ మ్యాచ్‌లు ఆడి 35 సగటుతో 493 పరుగులు చేశాడు. ఈ సంవత్సరం అతను 1 టెస్ట్ మ్యాచ్ ఆడాడు. 8.50 సగటుతో 2 ఇన్నింగ్స్‌లలో 17 పరుగులు మాత్రమే చేయగలిగాడు. ఇటువంటి పరిస్థితిలో, ఇంగ్లాండ్ పర్యటనలో సీనియర్ బ్యాట్స్‌మన్‌గా అతని నుంచి భారీ అంచనాలు ఉంటాయి. ఇటువంటి పరిస్థితిలో కేఎల్ రాహుల్ టాప్ ఆర్డర్‌లో విఫలమైతే, ఓటమికి నింద అతనిపై పడటం ఖాయం. జస్ప్రీత్ బుమ్రా టీం ఇండియా అత్యుత్తమ బౌలర్లలో ఒకరు. బౌలింగ్ పరంగా శుభ్మాన్ గిల్, గౌతమ్ గంభీర్ అతని నుంచి చాలా ఆశలు పెట్టుకుంటారు. ఇంగ్లీష్ బ్యాట్స్‌మెన్‌ను బ్యాక్‌ఫుట్‌లో నెట్టగల ఏకైక బౌలర్ బుమ్రా. కానీ, అతనితో ఉన్న సమస్య ఏమిటంటే అతను నిరంతరం లాంగ్ స్పెల్‌లు వేయలేడు. అతనికి వెన్ను గాయం సమస్య ఉంది. అలాగే అతను మొత్తం 5 మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో పాల్గొనలేడు. అయితే, అతను తొలి టెస్ట్ మ్యాచ్‌లో ఆడటం ఖాయం. అటువంటి పరిస్థితిలో, టీం ఇండియా విజయం బాధ్యత అతనిపై ఉంటుంది. అతను సమయానికి భారతదేశం తరపున వికెట్లు తీయవలసి ఉంటుంది. ఈ విషయంలో అతను విఫలమైతే, ఓటమికి నింద కూడా అతనిపై పడుతుంది.

## ధోని సంచలన నిర్ణయంతో ప్రపంచమంతా ఫిదా






భారతదేశంలోని ప్రతి క్రికెట్ అభిమానికి ఇంగ్లాండ్ టెస్ట్ బ్యాట్స్‌మన్ ఇయాన్ బెల్ పేరు బాగా తెలుసు. ఈ బ్యాట్స్‌మన్ ఎప్పుడూ క్రికెట్ మైదానంలో టీం ఇండియా బౌలర్లకు చెమటలు పట్టించేవాడు. 2011లో నాటింగ్‌హామ్‌లో భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో, ఇయాన్ బెల్ రనౌట్ కావడంపై పెద్ద వివాదం తలెత్తింది. క్రికెట్ చరిత్రలో కొన్ని సంఘటనలు ఆట నియమాలకంటే ఆట స్ఫూర్తికే పెద్ద పీట వేస్తాయి. అలాంటి ఒక సంఘటన 2011లో భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరిగిన టెస్ట్ సిరీస్‌లో చోటు చేసుకుంది. అప్పుడు టీమిండియా కెప్టెన్‌గా ఉన్న మహేంద్ర సింగ్ ధోనీ తీసుకున్న ఒక నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఇది ఇయాన్ బెల్ రనౌట్ వివాదంగా ప్రసిద్ధి చెందింది. 2011 ఇంగ్లాండ్ పర్యటనలో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య నాటింగ్‌హామ్‌లో రెండో టెస్ట్ మ్యాచ్ జరుగుతోంది. మ్యాచ్ మూడో రోజు ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్ ఆడుతోంది. టీ విరామానికి ముందు ఆఖరి బంతిని ఇషాంత్ శర్మ వేయగా, ఇయాన్ బెల్ బ్యాటింగ్ చేస్తున్నాడు. ఇయాన్ మోర్గాన్ క్రీజ్‌లో ఉన్నాడు. మోర్గాన్ బంతిని డీప్ స్క్వేర్ లెగ్ దిశగా కొట్టాడు. బంతి బౌండరీకి వెళుతుందని భావించిన ఇయాన్ బెల్, మోర్గాన్‌తో మాట్లాడేందుకు క్రీజ్ వదిలి బయటకు వచ్చాడు. అయితే, బౌండరీ లైన్‌కు కొద్ది దూరం ముందు ప్రవీణ్ కుమార్ బంతిని ఆపి, వికెట్ కీపర్ ధోనీకి విసిరాడు. ధోనీ బంతిని అభినవ్ ముకుంద్‌కు అందించగా, అతను బెల్ క్రీజ్‌లో లేకపోవడంతో వెంటనే బెల్ వికెట్లను పడేశాడు. భారత ఆటగాళ్లు రనౌట్ కోసం అప్పీల్ చేశారు. థర్డ్ అంపైర్ ఇయాన్ బెల్‌ను రనౌట్‌గా ప్రకటించాడు. నియమాల ప్రకారం బెల్ రనౌట్ అయినప్పటికీ, క్రికెట్ స్ఫూర్తికి విరుద్ధంగా ఈ సంఘటన జరిగిందని పలువురు భావించారు. ఇయాన్ బెల్ ఉద్దేశపూర్వకంగా క్రీజ్ వదలి వెళ్లలేదు. బంతి బౌండరీకి వెళుతుందని, టీ బ్రేక్ అని భావించి అలా చేశాడు. అంపైర్ నిర్ణయంతో ఇంగ్లాండ్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీ విరామం సమయంలో, అప్పటి ఇంగ్లాండ్ కెప్టెన్ ఆండ్రూ స్ట్రాస్, కోచ్ ఆండీ ఫ్లవర్ భారత డ్రెస్సింగ్ రూమ్‌కు వెళ్లి ధోనీతో మాట్లాడారు. పరిస్థితిని వివరించి, రనౌట్ అప్పీల్‌ను ఉపసంహరించుకోవాలని కోరారు. ధోనీ, తన జట్టు సభ్యులతో చర్చించి, ఆట స్ఫూర్తిని గౌరవిస్తూ అప్పీల్‌ను వెనక్కి తీసుకునేందుకు అంగీకరించాడు. ఈ నిర్ణయంతో ఇయాన్ బెల్ మళ్ళీ బ్యాటింగ్‌కు వచ్చాడు.

## భారత్ ఈ సిరీస్‌ని కైవసం చేసుకుంటుంది



భారత్, ఇంగ్లండ్ మధ్య తొలి టెస్ట్ మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. మరికొన్ని గంటల్లో ఈ రెండు జట్లు హెడ్డింగ్లే వేదికగా తలపడనున్నాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ గైర్హాజరులో యువ క్రికెటర్ శుభ్‌మాన్ గిల్ సారథ్యంలో బరిలోకి దిగుతున్న టీం ఇండియాపై ఎలా ఆడుతుందా అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సిరీస్‌ను భారత్ కైవసం చేసుకుంటుందని క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ అంచనా వేశారు. ఓ క్రీడా ఛానెల్‌తో ఆయన మాట్లాడుతూ.. ఈ సిరీస్‌లో భారత్ 31 తేడాతో విజయం సాధిస్తుందని అన్నారు. ఇక బౌలింగ్ అటాక్‌లో బుమ్రా కీలక పాత్ర పోషిస్తాడని.. ఇతర బౌలర్ల నుంచి అతనికి సహకారం లభించాలని పేర్కొన్నారు. ప్రసిద్ధ్ కృష్ణ మంచి ఫామ్‌లో ఉన్నాడన్న సచిన్.. అర్షదీప్, శార్దూల్, నితీశ్, హర్షిత్ సపోర్టింగ్ బౌలర్ల పాత్ర తీసుకుంటారని తెలిపారు. స్పిన్‌లో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లో రాణిస్తారని.. అందరూ కలిసి అద్భుతాలు చేస్తారని సచిన్ అన్నారు.



## ‘పెద్ది’లో రామ్ బుజ్జిగా దివ్యేందు..

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ‘పెద్ది’. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ పాన్ ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ‘మీర్జాపూర్’ వెబ్‌సిరీస్ ఫేమ్, బాలీవుడ్ స్టార్ యాక్టర్ దివ్యేందు శర్మ కీలక పాత్ర చేస్తున్నారు. గురువారం మేకర్స్ ఆయనకి బర్త్ డే విషెస్ చెబుతూ స్పెషల్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ చిత్రంలో రామ్ బుజ్జి అనే ఆసక్తికరమైన క్యారెక్టర్‌లో ఆయన కనిపించబోతున్నారు. క్రికెట్ బంతిని ఎగరేస్తూ ఇంటెన్స్ లుక్‌లో కనిపించిన దివ్యేందు పోస్టర్ అదిరిపోయింది. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో నిర్మించిన మాసీవ్ సెట్లో హై-ఆక్టేన్, హై బడ్జెట్‌తో ఓ భారీ ట్రైన్ యాక్షన్ ఎపిసోడ్ షూట్ చేస్తున్నారు. ఈ మైండ్- బ్లోయింగ్ యాక్షన్ సీక్వెన్స్ సినిమాలో మేజర్ హైలైట్‌గా వుండబోతోంది. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

## మధ్య తరగతి కుటుంబాలను ప్రతిబింబిస్తూ..



సెవెన్ హిల్స్ బ్యానర్‌పై వేణుదారి బేబీ నేహశ్రీ సమర్పణలో సెవెన్ హిల్స్ సతీష్ నిర్మాతగా నవీన్ కుమార్ దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం సోలో బాయ్. ఈ చిత్రంలో బిగ్ బాస్ ఫేమ్ గౌతం కృష్ణ హీరోగా నటిస్తుండగా పసుపులేటి రమ్య, శ్వేత అవస్తి హీరోయిన్లుగా నటించారు. పోసాని కృష్ణ మురళి, అనిత చౌదరి, షఫీ, ఆర్కే మామ, భద్రం ఆనంద్ చక్రపాణి, సూర్య, ల్యాబ్ శరత్, అరుణ్ కుమార్, రజిని వర్మ తదితరులు ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించారు. జూలై 4వ తేదీన వెండి తెరపై ఈ చిత్రం ప్రేక్షకులను పలకరించనున్న సందర్భంగా చిత్ర బృందం ట్రైలర్ విడుదల చేయడం జరిగింది. అయితే ఇటీవలే ఆపరేషన్ సింధూర్‌లో అమరుడైన జవాన్ మురళి నాయక్ తల్లిదండ్రుల చేతుల మీదగా ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ... ‘‘చిత్ర ట్రైలర్ ఎంతో బాగుంది. చాలా మంచి విజువల్స్ కనిపించాయి. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను’’అని తెలిపారు. చిత్ర దర్శకుడు నవీన్ కుమార్ మాట్లాడుతూ.. ‘‘సోలో బాయ్ చిత్రం మధ్య తరగతి కుటుంబాలను ప్రతిబింబిస్తూ ఉంటుంది. గౌతమ్ కృష్ణ ఎంతో అద్భుతంగా నటించారు’’అని అన్నారు. చిత్ర నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ మాట్లాడుతూ.. ‘‘సోలో బాయ్ అనగానే ఎంతోమంది సోలోగా వచ్చి ఉన్నత స్థాయికి చేరిన వారు నాకు గుర్తొస్తారు’’అని పేర్కొన్నారు. హీరో గౌతమ్ కృష్ణ మాట్లాడుతూ మధ్య తరగతి కుటుంబాలను ఆధారంగా చేసుకుని తీసిన చిత్రమిదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి పట్నాయక్, సుధాకర్, యాట సత్యనారాయణ పాల్గొన్నారు.



## ‘నాగబంధం’ కోసం 5000 మంది డ్యాన్సర్లు

విరాట్ కర్ణ హీరోగా దర్శకుడు అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న పాన్‌ఇండియా చిత్రం ‘నాగబంధం’. లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి ఎన్‌ఐకె స్టూడియోస్ బ్యానర్‌పై కిషోర్ అన్నపురెడ్డి నిర్మిస్తున్నారు. సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ప్రస్తుతం మేకర్స్ ఒక కీలకమైన సన్నివేశాన్ని, ఒక పాటను భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ అశోక్ కుమార్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన అనంత పద్మనాభ స్వామి ఆలయం సెట్‌లో పాటను చిత్రీకరించారు. బాలీవుడ్ కొరియోగ్రాఫర్ గణేష్ ఆచార్య పర్యవేక్షణలో విరాట్ కర్ణతో పాటు 5000 మంది నృత్యకారులు ఈ పాటలో పాల్గొన్నారు. ఈ ఒక్క ఎపిసోడ్‌కే రూ.10 కోట్లు బడ్జెట్ కేటాయించారు. ‘నాగబంధం’ ఒక విజువల్ వండర్‌గా ఉండబోతోంది. ఈ చిత్రంలో నభా నటేష్, ఐశ్వర్యా మీనన్ హీరోయిన్స్‌గా నటిస్తుండగా, జగపతిబాబు, జయప్రకాశ్, మురళీ శర్మ, బీఎస్ అవినాష్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పురాణ ఇతిహాసాల నుంచి తీసుకున్న కథాంశాన్ని మిళితం చేస్తూ పద్మనాభస్వామి, పూరీ జగన్నాథ దేవాలయాల వద్ద ఇటీవల కనుగొనబడిన గుప్త నిధుల నుంచి ప్రేరణ పొంది, ఆధ్యాత్మిక సాహసోపేతమైన ఇతివృత్తాలతో ఈ సినిమా ఉంటుంది. ఈ పవిత్ర స్థలాలను రక్షించే నాగబంధం పురాతన ఆచారాలపై దృష్టి సారించి, భారతదేశంలోని విష్ణు దేవాలయాల చుట్టూ ఉన్న రహస్యాన్ని ఇందులో అద్భుతంగా ప్రజెంట్ చేస్తున్నారు. తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషలలో ఈ సినిమా విడుదల కానుంది అని చిత్ర యూనిట్ తెలిపింది.

## పోలీస్ కేసు దాకా వెళ్లిన యూట్యూబ్ రివ్యూ

టెక్నాలజీ ప్రపంచంలో కొత్త సినిమాలు వస్తే చాలు ఎవరైనా రివ్యూలు ఇచ్చేలా పరిస్థితి మారిపోయింది. కేవలం మీడియాలోనే కాదు యూట్యూబ్ ని వేదికగా చేసుకుని సమీక్షలు చేస్తూ లక్షలాది వ్యూస్‌తో డబ్బు సంపాదించుకుంటున్న ఇన్ఫ్లూయెన్సర్లు వేలల్లో ఉన్నారు. కొన్నిసార్లు వీళ్ళు హద్దులు మీరిన దాఖలాలు లేకపోలేదు. అయితే ఒక దర్శకుడు వీటికి ఎదురీది ఏకంగా పోలీస్ స్టేషన్ దాకా వెళ్ళిపోయాడు. అదేంటో చూద్దాం. గత వారం జూన్ 13న మలయాళంలో వ్యసన సమేతం బంధుమిత్రాదికల్ రిలీజయ్యింది. దీనికి టాలీవుడ్ షైన్ స్క్రీన్స్ అధినేత కం మెగా 157 నిర్మాత సాహు గారపాటి ప్రొడక్షన్



పార్ట్ నర్. వ్యసన సమేతం బంధుమిత్రాదికల్ కు రిపోర్ట్స్ బాగానే ఉన్నాయి. బుక్ మై షో ట్రెండిరగ్ లో ఉంది. అయితే సినీఫైల్స్ అనే యూట్యూబ్ ఛానల్ నిర్వాహకుడు బిజిత్ విజయన్ తాను డిమాండ్ చేసినంత డబ్బు ఇవ్వకుంటే నెగటివ్ రివ్యూ చెబుతానని ఈ సినిమా దర్శకుడు కం సహ నిర్మాత ఎస్ విపిన్ ని బెదిరించాడట. అయితే ఇందుకు అతను అంగీకరించకపోవడంతో మూవీ గురించి బ్యాడ్ రివ్యూ ఇచ్చేసి దానికి పని చేసిన వాళ్ళను బెదిరించడం మొదలుపెట్టాడట. దీంతో ఒళ్ళు మండిన విపిన్ కేరళలోని పాలరిపట్టం పోలీస్ స్టేషన్ కు వెళ్ళిపోయి కంప్లయింట్ ఇచ్చాడు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది. అయినా ఉద్దేశపూర్వకంగా డబ్బులు ఆశించి ఇలా నెగటివ్ చేయడం ఎంత మాత్రం కరెక్ట్ కాదు. ఒకవేళ నిజంగా సినిమా బాలేకపోతే ఆడియన్స్ బలవంతంగా చూడరు. రివ్యూలు బాగా ఇచ్చినా ఇవ్వకపోయినా వాళ్ళ నిర్ణయాలు వాళ్ళు తీసుకుంటారు. అలాంటిది ఇలా బెదిరింపులకే దిగి సొమ్ములు చేసుకోవాలని చూడటం అన్యాయం.

## విచిత్ర సమస్యతో ‘ఉప్పు కప్పురంబు’




ఎల్లనార్ ఫిల్మ్స్ ప్రై లి.బ్యానర్ పై రాధిక లావూ నిర్మాణంలో ఐ.వి.శశి దర్శకత్వం వహించిన చిత్రం ‘ఉప్పు కప్పురంబు’. వసంత్ మరింగంటి రచించిన ఈ చిత్రంలో సుహాస్, కీర్తి సురేష్ ప్రధానపాత్రలు పోషించగా, బాబు మోహన్, శత్రు, తాళ్ళూరి రామేశ్వరి ఇతర కీలక పాత్రలను పోషించారు. ఈ సినిమా మన దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా 240 దేశాలలో జూలై 4న ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. తెలుగుతో పాటు హింది, తమిళం, మళయాళం, కన్నడ, ఇంగ్లీష్‌తో కలిపి 12 భాషలలో సబ్‌టైటిల్స్‌తో ఇది ప్రసారం కానుంది. 1990లో చిట్టి జయపురం అనే పల్లెటూరి ఒక చిత్రమైన సమస్యని ఎదుర్కొంటూ ఉంటుంది. ఈ ఊరిలో మరణించినవారిని పూడ్చిపెట్టటానికి చోటు లేదు. కొత్తగా నియమించబడిన, ఆదర్శవంతురాలైన గ్రామాధికారి, అపూర్వ (కీర్తి సురేష్), ఆ ఊరి కాటికాపరి చిన్న (సుహాస్) ఈ సమస్యను పరిష్కరించడానికి ఏం చేశారనేది ఆద్యంతం హాస్యభరితంగా సాగునుంది. కీర్తి సురేష్ మాట్లాడుతూ, ‘ఇందులో అపూర్వ అనే భిన్నమైన పాత్ర చేశాను. ఆమె ఆదర్శవాది, దృఢనిశ్చయం కలిగినది. ఈ సినిమాలో ఉన్న సమస్య నన్ను బాగా కదిలించింది’ అని తెలిపారు. ‘చిన్నా పాత్ర ఇదివరకు నేను చేసిన పాత్రల కంటే పూర్తిగా భిన్నంగా ఉంటుంది. ఇతను ఒక విచిత్రమైన పరిస్థితిలో ఇరుక్కుంటాడు. ఆ పరిస్థితి ఏంటి? అనేది ఆద్యంతం ఉత్కంఠభరితంగా ఉంటుంది. ఈ సినిమా నీతులు చెప్పేదిగా ఉండదు’ అని సుహాస్ అన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in